





RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక

**| విలేకరులు కావలెను |**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.

సంచిక : 320 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | ఆదివారం | 08-03-2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00



### ముచ్చటగా మూడో
# టైటిల్ కొట్టేనా

- నేడు న్యూజిలాండ్‌తో తుది పోరు
- డిఫెండింగ్ ఛాంపియన్ భారత్ కప్ కొడితే పలు రికార్డులు నమోదు
- రాత్రి 7.00గం॥ల నుంచి

**అహ్మదాబాద్**
టి20 ప్రపంచకప్ టైటిల్ పోరుకు రంగం సిద్ధమైంది. నరేంద్ర మోడీ స్టేడియంలో ఆదివారం జరిగే టైటిల్‌కోసం భారత్, న్యూజిలాండ్ జట్లు తలపడనున్నాయి. ఈ ట్రోఫీని భారతజట్టు గెలిస్తే పలు రికార్డులను నెలకొల్ప నుంది. డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగిన భారత్ ఈ టైటిల్ గెలిస్తే వరుసగా రెండోసారి ఈ టైటిల్‌ను కైవసం చేసుకున్నట్లవుతుంది. అలాగే మూడుసార్లు ఈ టైటిల్‌ను గెలిచిన జట్టునూ నిలవనుంది. ఆతిథ్య హోదాలో టైటిల్ సాధించిన జట్టుగానూ రికార్డు నెలకొల్పనుంది. 2007 నుంచి ఇప్పటివరకు 9 టి20 ప్రపంచకప్ టోర్నీలు జరగ్గా.. వీటిలో ఒక్కసారి కూడా ఆతిథ్య జట్టు టైటిల్ గెలిచిన దాఖలాలు లేవు. అలాగే వరుసగా రెండుసార్లు టైటిల్ కొట్టిన జట్టు ఏదీ లేదు.

-మిగతా 2 లో

### లొంగిపోయిన మావోయిస్టుల
# బాధ్యత మాదే

## ఇందిరమ్మ ఇండ్లు, నిమ్స్‌లో ఉచిత వైద్యం

- ఎవరి అభీష్టం మేరకైనా నచ్చిన పార్టీల్లో చేరొచ్చు
- గణపతి సహా మిగతా మావోయిస్టులు లొంగిపోవాలి
- సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో లొంగిపోయిన 130 మంది మావోయిస్టు
- మావోయిస్టుల లొంగుబాటు సభలో సీఎం రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్,**
మావోయిస్టు అగ్రనేత గణపతి సహా ఇతర మావోయిస్టులంతా లొంగిపోవాలని, వారి భవిష్యత్తు భద్రతకు తమ ప్రభుత్వం బాధ్యత తీసుకుంటుందని సీఎం రేవంత్‌రెడ్డి భరోసా ఇచ్చారు. తెలంగాణలో లొంగిపోయిన మావోయిస్టులకు నిమ్స్‌లో ఉచిత వైద్యంతోపాటు, ఇందిరమ్మ ఇండ్లు కట్టిస్తామని హామీ ఇచ్చారు. హైదరాబాద్ పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో శనివారం 130 మంది మావోయిస్టుల లొంగుబాటు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో లొంగిపోయిన మావోయిస్టులకు పునరావాసం కల్పించి, రివార్డులు అందజేస్తామని చెప్పారు.

-మిగతా 2 లో






### అమరావతిలో ప్రయివేటు
# శాటిలైట్ల తయారీ

- స్పేస్‌సిటీ, క్రియేటివ్ సిటీలు నిర్మిస్తాం
- జనాభా వృద్ధిపై దృష్టి అవశ్యం
- 'రైసినా డైలాగ్' సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు

**న్యూఢిల్లీ**
అంతర్జాతీయ సమాజ దృష్టిని ఆకర్షించేలా ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నగరాన్ని తీర్చిదిద్దుతున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు. తొమ్మిది అంశాలతో కూడిన నగరాలను అమరావతిలో ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రయివేటు రంగంలో శాటిలైట్లను కూడా తయారు చేసి లాంచ్ చేసేలా ఓ స్పేస్ సిటీని, డ్రోన్ల కోసం డ్రోన్ సిటీని, ఆవిష్కరణల కోసం క్రియేటివ్ సిటీని నెలకొల్పుతున్నామని చెప్పారు. న్యూఢిల్లీలోని భారతమండపంలో 'రైసినా డైలాగ్' పేరిట శనివారం నాడు నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో ఆయన ప్రసంగించారు. ఈ సదస్సుకు కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి జై శంకర్, 110 దేశాల నుంచి 2,700 మందికి పైగా ప్రతినిధులు, మేధావులు, నిపుణులు, వ్యూహకర్తలు హాజరయ్యారు.

-మిగతా 2 లో



### రెండో వారానికి
# చేరిన పోరు

- ఇరాన్‌పై విరుచుకుపడిన ఇజ్రాయిల్, అమెరికా
- ఇజ్రాయిల్‌కు ఆయుధాలు విక్రయిస్తున్న అగ్రరాజ్యం
- మెహ్రాబాద్ ఎయిర్‌పోర్టులో మంటలు
- జనావాసాలు, పాఠశాలలు, ఆస్పత్రులనూ వదలని యుద్ధోన్మాదం

**టెహ్రాన్, వాషింగ్టన్**
ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ సంయుక్త యుద్ధోన్మాద దాడులతో మధ్యప్రాచ్యంలో మొదలైన పోరు శనివారం రెండో వారంలో ప్రవేశించింది. దాడులు, ప్రతిఘటన చర్యలు విస్తరించడంతో యుద్ధం ఉధృత రూపం దాల్చింది. ఇరాన్ రాజధాని టెహ్రాన్, ఇస్ఫహాన్‌లపై ఇజ్రాయిల్ తాజాగా దాడులు జరిపింది. ఇజ్రాయిల్ వైమానిక దాడుల కారణంగా టెహ్రాన్‌లోని ప్రధాన వాణిజ్య ఎయిర్‌పోర్టులలో ఒకటైన మెహ్రాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో భారీగా మంటలు వ్యాపించాయి. పేలుళ్ల ధాటికి విమానాశ్రయం రన్‌వేపై ఉన్న అనేక విమానాలు తగలబడ్డాయని ప్రత్యక్షసాక్షులు తెలిపారు. నగరంలోని అనేక ప్రాంతాలలో పేలుడు శబ్దాలు వినిపించాయి. ఆకాశంలో దట్టమైన పొగలు అలముకున్నాయి. భూకంపం వచ్చినట్లు జనావాసాలు ఊగిపోయాయి. శుక్రవారం రాత్రంతా దాడులు జరుగుతూనే ఉన్నాయి.

-మిగతా 2 లో

### ఏఈఓ ల పై
# ఉన్నతాధికారుల జులుం...!

## ఏవో ల విధులు సైతం ఏఈవో లకే అంటగట్టడం పై మండిపాటు







- సొంత శాఖలోనే వివక్షకు గురవుతున్నామని ఏఈఓ ల ఆవేదన
- ఏవో లకు బయోమెట్రిక్ హాజరు పెట్టాలని రైతు సంఘాల డిమాండ్
- రాష్ట్ర వ్యవసాయ శాఖలో పని ఒత్తిడి పై ఏఈఓల తీవ్ర ఆందోళన
- వ్యక్తిగత జీవితం లేకుండా చేస్తున్నారని అధికారులపై మండిపాటు

**హైదరాబాద్, మార్చి 7(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
రాష్ట్రంలో వ్యవసాయ విస్తరణ అధికారులపై ఏఓల జులుం పెరుగుతుందని, వారు వారి విధులను సైతం సక్రమంగా నిర్వహించకుండా తమపైనే అదనపు భారం మోపుతున్నారని ఏఈవోలు ఆరోపిస్తున్నారు. రోజు రోజుకు తమ పరిస్థితి ముందు నుయ్యి, వెనక గొయ్యి లాగా తయారైంది. సొంత శాఖలోనే ఉన్నతాధికారుల తీరుతో వివక్షకు గురవుతున్నామని రాష్ట్ర వ్యాప్తంగా ఏఈఓ సంఘాలు పోరు బాటకు పిలుపునిచ్చాయి. ఏవో ల తీరుకు నిరసనగా నిజామాబాద్ , పెద్దపల్లి జిల్లాలో ఏఈఓ లు జిల్లా వ్యవసాయ అధికారులకు నిరసన పత్రాలు అందజేశారు. ఇప్పటికే రైతు భరోసా, రైతుభీమా, మట్టి నమూనాల సేకరణ, మట్టి పరీక్షలు, రైతు గుర్తింపు కార్డుల నమోదు, పంటల సర్వే మొదలగు 49 రకాల విధులు నిర్వర్తిస్తూ తలకు మించిన భారాన్ని మోస్తున్నారు. క్షేత్ర స్థాయిలో సహాయకులను కేటాయించకుంటే

-మిగతా 2 లో

### దేశంలో 308కి చేరిన
# అపరకుబేరులు

- గతేడాది కొత్తగా 57 మంది నమోదు
- హురున్ గ్లోబల్ లిస్ట్ 2026 వెల్లడి



**న్యూఢిల్లీ మార్చి 7(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
దేశంలో అధిక ధరలతో ప్రజల ఆదాయాలు సన్నగిల్లుతోంటే.. మరోవైపు కుబేరుల సంఖ్య భారీగా పెరుగుతోంది. హురున్ గ్లోబల్ రిచ్ లిస్ట్ 2026 నివేదిక ప్రకారం.. భారత్ ఇప్పుడు 308 మంది బిలియనీర్లతో ప్రపంచంలోనే మూడవ ర్యాంక్‌లో నిలిచింది. గడిచిన ఏడాదిలో భారత్‌లో 57 మంది కొత్త బిలియనీర్లు పుట్టుకొచ్చారు. మొత్తం 308 అపర కుబేరుల సగటు సంపద సుమారు రూ.36,570 కోట్లుగా నమోదయ్యింది. వీరందరి మొత్తం సంపద 10 శాతం పెరిగి రూ.112.6 లక్షల కోట్లకు చేరింది. ఇందులో 199 మంది సంపద పెరగ్గా, 109 మంది సంపదలో మార్పు లేకుండా ఉంది.

-మిగతా 12 లో

## అధికారుల నిర్లక్ష్యంతో వాణిజ్య కేంద్రాలకు డొమెస్టిక్ గ్యాస్...

- రాష్ట్రవ్యాప్తంగా నియమాలకు తూట్లు
- సామాన్యులకు కష్టాలు తెచ్చే ప్రమాదం

**హైదరాబాద్, మార్చి 7(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
రాష్ట్రంలో గృహ వినియోగం కోసం అందించాల్సిన డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లు పెద్ద ఎత్తున వాణిజ్య అవసరాలకు మళ్లుతున్నాయన్న ఆరోపణలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా గ్యాస్ ఏజెన్సీలు గృహ వినియోగానికి కేటాయించిన సిలిండర్లను హోటళ్లు, టీ స్టాళ్లు, తినుబండారాల కేంద్రాలు తదితర వాణిజ్య సంస్థలకు సరఫరా చేస్తున్న పరిస్థితి కొనసాగుతోందని ప్రజా



సంఘాలు విమర్శిస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా వాణిజ్య అవసరాల్లో దాదాపు 90 శాతం వరకు డొమెస్టిక్ సిలిండర్లే వినియోగంలో ఉన్నాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.నియమాల ప్రకారం హోటళ్లు, రెస్టారెంట్లు, ఇతర వాణిజ్య సంస్థలు వాణిజ్య గ్యాస్ సిలిండర్లను మాత్రమే వినియోగించాలి. అయితే అధిక ధరలు, తనిఖీల లోపం వంటి కారణాలతో చాలా మంది వ్యాపారులు వాణిజ్య సిలిండర్ల వాడకాన్ని ఎప్పుడో మానేసి డొమెస్టిక్ సిలిండర్లను వినియోగించడం సాధారణంగా మారిపోయిందని విమర్శలు వినిపిస్తున్నాయి.ప్రస్తుతం అంతర్జాతీయ పరిస్థితులు కూడా ఆందోళన కలిగిస్తున్నాయి. పశ్చిమ దేశాల్లో కొనసాగుతున్న

-మిగతా 2 లో

### బెంగాల్ పర్యటనలో
# ప్రొటోకాల్ లోపాలు



2

## లొంగిపోయిన మావోయిస్టుల బాధ్యత మాదే

(మొదటి తరువాయి)

ప్రభుత్వం ప్రకటించిన మావోయిస్టుల రివార్డు చాలా తక్కువగా ఉన్నదని, కనీస అవసరాలు తీర్చుకునేందుకు కూడా సరిపోదని ఇటీవల లొంగిపోయిన మావోయిస్టులు తనతో చెప్పి వాపోయారని చెప్పారు. వారి అభ్యర్థన మేరకు ఆరోగ్య భద్రత కార్డు ఇవ్వడమే కాకుండా, నిమ్స్ వంటి దవాఖానల్లో పూ ర్తిస్థాయిలో ఉచిత వైద్యం అందిస్తామని హామీ ఇచ్చారు. మావోయిస్టులకు భూమి కేటాయించే విషయంలో కొంత సందిగ్ధత ఉన్నదని, భూములు అందుబాటులో లేవని చెప్పారు. వరవరరావు వంటి మావోయిస్టులపై కేసులను ఎత్తివేస్తారా అని మీడియా ప్రతినిధుల ప్రశ్నలకు 'అవన్నీ ఎత్తేయగలిగే కేసులుగా ఉంటే ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుంది.

**గణపతి సహా మిగతా మావోయిస్టులు లొంగిపోవాలి**

కేంద్ర ప్రభుత్వ సూచన మేరకు మావోయిస్టు అగ్రనేత గణపతి సహా సెంట్రల్, స్టేట్ కమిటీలు, ఇతర వివిధ హోదాల్లో అజ్ఞాతవాసంలో ఉన్న మావోయిస్టులు జనజీవన స్రవంతిలోకి రావాలని సీఎం కోరారు. 'లొంగిపోయేందుకు గణపతి ఎవరితో చర్చలు జరుపుతున్నారనేది మాకు స్పష్ట త లేదు' అని ఆయన పేర్కొన్నారు. 'లొంగిపోయిన మావోయిస్టులు ప్రత్యక్ష రాజకీయాల్లోకి వస్తారా? లేక కుటుంబ సభ్యులతో గడుపుతారా? అనేది వాళ్లిష్టం. అని సీఎం తెలిపారు.

**20 ఏండ్ల లోపు వారు 40మంది**

సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో లొంగిపోయిన 130 మంది మావోయిస్టుల్లో 18 నుంచి 20 ఏండ్ల లోపువారు 40 మంది, 21-30 ఏండ్ల లోపు 60 మంది, 31-61 ఏండ్ల వయసు మధ్యలో 30 మంది ఉన్నారు. పీఎల్‌జీఏ మొదటి బెటాలియన్‌లో 42 మంది ఉన్నారు. వీరిలో ఇద్దరు రాష్ట్ర కమిటీ సభ్యులు, దండకారణ్య స్పెషల్ జోన్ కమిటీ సభ్యుడు, రీజినల్ కమిటీ సభ్యుడు, డివిజన్ కమిటీ సభ్యులు 10 మంది, ఏరియా కమిటీ సభ్యులు 46 మంది చొప్పున ఉన్నారు. సెంట్రల్ కమిటీ స్టాఫ్‌లో విధులు నిర్వర్తిస్తున్న వారు 10 మంది ఉన్నారు. కార్యక్రమంలో ఇంటెలిజెన్స్ డీజీ విజయ్‌కుమార్, గ్రేహౌండ్స్ డీజీ అనిల్‌కుమార్, ఇంటెలిజెన్స్ ఐజీ సుమతి తదితరులు పాల్గొన్నారు.

## అమరావతిలో ప్రయివేటు శాటిలైట్ల తయారీ

(మొదటి తరువాయి)

ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. పేద, ధనిక అనే తారతమ్యం లేకుండా జనాభా వృద్ధిపై తక్షణమే దృష్టి సారించాల్సిన అవసరముందని తెలిపారు. ప్రజల దృక్కోణాన్ని కూడా మార్చేందుకు చర్యలు చేపట్టి..సంతాన సాఫల్యత రేటును పెంచాల్సిన అవసరముందని తెలిపారు. ఒక ప్రజాప్రతినిధిగా గతంలో తాను కూడా జనాభా నియంత్రణ గురించి మాట్లాడానని, అయితే ప్రస్తుత పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయని ఆయన చెప్పారు. గతంలో పెద్ద కుటుంబ వ్యవస్థలు ఉండేవని, దేశానికి అదో పెద్ద ఆస్తి కూడా అని ఆయన చెప్పుకొచ్చారు. అయితే ప్రస్తుతం పెద్ద కుటుంబాలు కనుమరుగై..మైక్రో ఫ్యామిలీలే మిగిలాయని చెప్పారు. అందువల్ల ఏజింగ్ సంబంధిత సమస్యలను ఎదుర్కొంటున్న దేశాలు తక్షణమే జనాభా నిర్వహణపై దృష్టి సారించాలని సూచించారు. సంతాన సాఫల్యత రేటు 1.5 నుంచి 2.1కు పెరిగేలా తాము చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. మూడో బిడ్డ పుడితే రూ.25 వేల ఆర్థిక సాయం, నెలకు రూ.వెయ్యి చొప్పున ఆర్థిక సాయం, విద్యా తదితర ప్రోత్సాహకాలు అందించనున్నట్లు ప్రకటించామని చంద్రబాబు చెప్పారు.

## రెండో వారానికి చేరిన పోరు

(మొదటి తరువాయి)

క్షిపణి స్థావరాలకు కేంద్రమైన కెర్మన్‌షా నగర పరిసరాలలో కూడా పేలుళ్లు సంభవించాయి. టెహ్రాన్, సెంట్రల్ ఇరాన్‌లోని క్షిపణి లాంచర్లు, ఇతర లక్ష్యాలపై తాజాగా 80 యుద్ధ విమానాలు దాడి చేశాయని ఇజ్రాయిల్ సైన్యం తెలిపింది. టెహ్రాన్‌లోని భూగర్భ సైనిక బంకర్‌ను యాభై జెట్ విమానాలు ధ్వంసం చేశాయని ఇజ్రాయిల్ రక్షణ దళం ప్రకటించింది. ఈ బంకర్ ఇరాన్ సుప్రీం నేత ఖమేనీకి చెందిన భవన సముదాయాల కింద ఉంది. కాగా ఇరాన్‌పై బాంబు దాడులను ముమ్మరం చేస్తానని అమెరికా హెచ్చరించింది. నిన్నటి వరకూ సైనిక స్థావరాలు, రాజకీయ కేంద్రాల పైనే దాడులు చేసిన ఇజ్రాయిల్, అమెరికా సేనలు ఇప్పుడు జనావాసాలు, పాఠశాలలు, ఆస్పత్రులను కూడా వదలడం లేదు. తమ దేశంలోని జనావాసాలపై దాడులు చేస్తున్నారని, ఇది యుద్ధ నేరాల కిందికే వస్తుందని ఐక్యరాజ్యసమితిలో ఇరాన్ రాయబారి అమిర్-సయాద్ ఇరావనీ భద్రతా మండలికి ఫిర్యాదు చేశారు. దేశాన్ని కాపాడుకునేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ'లో భాగంగా అమెరికా ఇప్పటి వరకూ ఇరాన్‌లోని మూడు వేల లక్ష్యాలపై దాడులు జరిపింది. లెబనాన్‌లోని హెజ్బుల్లా స్థావరాలను లక్ష్యంగా చేసుకొని బీరుట్‌లో ఇజ్రాయిల్ దాడులు కొనసాగుతున్నాయి. ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిపోవాల్సిందిగా ఇజ్రాయిల్ హెచ్చరిస్తోంది. బాంబు దాడులు ప్రారంభమైన తర్వాత ఇప్పటి వరకూ మూడు లక్షల మంది ప్రజలు ప్రాణభయంతో వేరే ప్రాంతాలకు చేరుకున్నారు.

## బెంగాల్ పర్యటనలో ప్రొటోకాల్ లోపాలు

### మమత సర్కార్‌పై రాష్ట్రపతి అసహనం



**న్యూఢిల్లీ**

: పశ్చిమ బెంగాల్‌లోని తృణమూల్ కాంగ్రెస్ నేతృత్వ ప్రభుత్వంపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము బహిరంగంగా అసంతృప్తి వ్యక్తం చేశారు. ఉత్తర బెంగాల్‌లోని సిలిగురిలో శనివారం నాడు అంతర్జాతీయ సంతాల్ ఆదివాసీ సదస్సుకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరుకావాల్సివుంది. అయితే అక్కడ ఈ సదస్సు నిర్వహించేందుకు అధికారులు చివరి నిమిషంలో అనుమతి రద్దు చేశారు. ప్రజలు భారీగా గుమిగూడే అవకాశం ఉందన్న భద్రతా కారణాలను చూపుతూ వేదికను డార్జిలింగ్‌కు మార్చారు. ఈ అంశంపై స్థానికుల ఎదుటే ముర్ము అసహనం వ్యక్తంచేశారు. ప్రోటోకాల్‌తో పాటు సన్నాహాల్లో తలెత్తిన లోపాలను ముర్ము ఎత్తి చూపారు. తాను రాష్ట్రానికి వెళ్లినప్పుడు ఎయిర్‌పోర్టులో స్వాగతం పలికేందుకు ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కానీ, కనీసం ఆ రాష్ట్ర మంత్రులు కానీ రాలేదన్నారు. కేవలం మేయర్ మాత్రమే వచ్చారని అన్నారు. సిలిగురిలో 5 లక్షల మంది ప్రజలు తరలివచ్చినా సరిపోయేంత స్థలం ఉందని చెప్పారు. సదస్సు చప్పగా జరగాలని, ఆదివాసీలు ఎవరూ అక్కడకు రావద్దనే ఉద్దేశంతోనే అలా చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే మమతతో తనకు ఎలాంటి ద్వేషం లేదని, ఆమె తన చెలెల్లు లాంటిదని రాష్ట్రపతి ముర్ము వ్యాఖ్యానించారు. మరోవైపు, ఈ విషయంపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కూడా స్పందించారు. "రాష్ట్రపతి వ్యక్తం చేసిన బాధ, వేదన భారతదేశ ప్రజల మనస్సుల్లో అపారమైన విచారాన్ని కలిగించింది. తృణమూల్ ప్రభుత్వం నిజంగా అన్ని పరిమితులను దాటింది. రాష్ట్రపతికి జరిగిన ఈ అవమానానికి వారి పరిపాలన బాధ్యత వహిస్తుంది" అని ప్రధాని మోదీ ఎక్స్‌లో ట్వీట్ చేశారు.

# ముచ్చటగా మూడో టైటిల్ కొట్టేనా

(మొదటి తరువాయి)

ఈ నేపథ్యంలో అహ్మదాబాద్ వేదికగా ఆదివారం జరిగే ఫైనల్లో టీమిండియా టైటిల్ గెలిచి పలు రికార్డును నమోదు చేయాలని అభిమానులు ఆకాంక్షిస్తున్నారు. టీమిండియా టైటిల్‌ను సాధిస్తే మూడుసార్లు టి20 ప్రపంచకప్ టైటిల్ నెగ్గిన తొలి జట్టుగానూ రికార్డుపుటల్లోకెక్కనుంది. ఇప్పటివరకు భారత్, ఇంగ్లండ్, వెస్టిండీస్ జట్లు రెండేసిసార్లు టైటిళ్లను సాధించగా.. శ్రీలంక, పాకిస్తాన్, ఆస్ట్రేలియా ఒక్కో సారి మాత్రమే ఈ టైటిల్‌ను కైవసం చేసుకున్నాయి. ఇక న్యూజిలాండ్ జట్టు టి20 ప్రపంచకప్ ఫైనల్‌కు చేరడం ఇదే రెండోసారి మాత్రమే. ఇంతకుముందు 2021లో ఫైనల్‌కు చేరినా ఆస్ట్రేలియా చేతిలో ఓడి రన్నరప్‌కే పరిమితమైంది. భారత్, న్యూజిలాండ్ జట్లు ఇప్పటి వరకు 30 టి20ల్లో ముఖాముఖి తలపడగా.. భారత్ 18మ్యాచుల్లో న్యూజిలాండ్ 11మ్యాచుల్లో విజయం సాధించాయి. ఒక మ్యాచ్ టై కాగా... స్వదేశంలో టీమిండియా 11 మ్యాచుల్లో గెలిస్తే.. కివీస్ 4 టి20ల్లో విజయం సాధించింది. న్యూజిలాండ్ గడ్డపై భారత్ 7, భారత గడ్డపై న్యూజిలాండ్ 5 మ్యాచుల్లో సత్తా చాటాయి. తటస్థ వేదికల్లో కివీస్ 2 మ్యాచ్‌లు గెలిచింది. ఇక టి20 ప్రపంచకప్‌లో ఈ రెండు జట్లు మూడుసార్లు తల పడగా.. మూడు సందర్భాల్లోనూ కివీస్‌దే విజయం.

తడబడుతూనే ఫైనల్‌కు టీమిండియా..

డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగిన భారతజట్టు తడబడుతూనే ఫైనల్‌కు చేరింది. ఈ టోర్నీకి ముందు టి20 ఫార్మాట్‌లో విధ్వంస బ్యాటింగ్‌తో చెలరేగిన అభిషేక్ శర్మ.. మెగా టోర్నీలో ఒక్కసారిగా ఫామ్ కోల్పోయాడు. ఇక మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి బౌలింగ్ పరిస్థితి కూడా అంతే దారుణంగా ఉంది. మరోవైపు శివమ్ దూబే బంతితో ధారాళంగా సమర్పించుకుంటున్నాడు... ఇలాంటి సమస్యలు మన జట్టును వేధిస్తున్నాయి. సెమీస్‌లో ఇంగ్లాండ్‌పై 253 పరుగుల భారీ స్కోర్ చేసినా.. గెలిచింది కేవలం 7పరుగుల తేడాతోనే. ఇది భారత శిబిరాన్ని కలవరపాటుకు గురి చేస్తోంది. మరోవైపు సెమీఫైనల్‌లో దక్షిణాఫ్రికాపై భారీ విజయంతో న్యూజిలాండ్ రెట్టించిన ఉత్సాహంతో ఫైనల్‌లో అడుగుపెట్టింది. ఈ నేపథ్యంలో తుదిపోరులో ప్రత్యర్థి జట్టును ఏమాత్రం తక్కువ అంచనా వేయడానికి వీల్లేదు.

ఫైనల్‌కు బ్యాటింగ్ పిచ్ సిద్ధం...

టి20 ప్రపంచకప్ ఫైనల్ కోసం బ్యాటింగ్ పిచ్‌ను సిద్ధం చేసినట్లు సమాచారం. గతంలో ఎదురైన అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ఈసారి ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా భారత జట్టు యాజమాన్యం పక్కా వ్యూహంతో వ్యవహరిస్తోంది. ఫైనల్ మ్యాచ్ కోసం ఎర్రమట్టి, నల్లమట్టి మిశ్రమంతో కూడిన 'మిక్స్‌డ్ సాయిల్' పిచ్‌ను ఉపయోగించారు. ముంబయిలో ఇంగ్లండ్‌తో జరి గిన సెమీఫైనల్ తరహాలోనే ఇది కూడా హై-స్కోరింగ్ మ్యాచ్‌కు వేదిక కానుంది. ముఖ్యంగా ఈ పిచ్‌లో నల్లమట్టి కంటే ఎర్రమట్టిని ఎక్కువగా వాడారు. ఎర్రమట్టి కారణంగా పిచ్‌పై బంతికి మంచి బౌన్స్ లభిస్తుంది. దీంతో రెండు ఇన్నింగ్స్‌ల లోనూ బ్యాటింగ్ సులువుగా ఉంటుందని అంచనా వేస్తున్నారు. స్పిన్నర్లకు పెద్దగా సహకారం లభించక పోవచ్చుని, ఈ పిచ్‌పై 200 పరుగులు సాధారణ స్కోర్‌గా నిలుస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ పిచ్ టీమిండియా దూకుడైన బ్యాటింగ్ శైలికి సరిగ్గా సరిపోతుందని, సంజూ శాంసన్, అభిషేక్ వంటి బ్యాటర్లు కీలక పాత్ర పోషించడానికి ఆస్కారం ఉంటుందని భావిస్తున్నారు. ఈ మైదానంలో లీగ్ దశలో జరిగిన మ్యాచ్‌లో తొలుత దక్షిణాఫ్రికా 213 పరుగులు చేస్తే.. కెనడా 8 వికెట్ల నష్టానికి 156 పరుగులు చేసి ఓటమిపాలైంది.

జట్లు(అంచనా)..

ఇండియా: సూర్యకుమార్(కెప్టెన్), అభిషేక్, సంజు శాంసన్(వికెట్ కీపర్), ఇషాన్ కిషన్, తిలక్ వర్మ, దూబే, హార్దిక్, అక్షర్, బుమ్రా, రింకు సింగ్, వరుణ్ చక్రవర్తి.

న్యూజిలాండ్: సాంట్నర్(కెప్టెన్), షెఫర్ట్(వికెట్ కీపర్), అలెన్, రచిన్ రవీంద్ర, ఫిలిప్స్, చాప్మన్, మిఛెల్, నీషమ్, కోంచీ, హ్రెన్రీ, ఫెర్గుసన్.

# ఏఈఓ ల పై ఉన్నతాధికారుల జులుం...!

(మొదటి తరువాయి)

ఉన్నతాధికారులు తమపై పనుల భారం పెంచుతున్నారని,గత 5 సంవత్సరాలుగా రాష్ట్ర వ్యాప్తంగా నిరవధికంగా పోరాటం చేస్తూ క్షేత్ర స్థాయిలో వెంటనే గ్రామ వ్యవసాయ సహాయకులను నియమించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం కేంద్రం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన డిజిటల్ పంట సర్వేలో భాగంగా రాష్ట్రంలో జియో రిఫరెన్స్ విలేజ్ మ్యాపులు ఉన్న 9,795 గ్రామాలలో ఈ రబీ నుండి 100 శాతం డిజిటల్ పంట సర్వే అమలు చేయడం కోసం రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 9,795 మంది వాలంటీర్ లను నియమించారు. జియో రిఫరెన్స్ మ్యాపులు లేని సుమారు 20 లక్షల ఫామ్ ఫీల్డ్స్ తో పాటుగా, కౌలు, యన్.డీ.ఎస్, సమస్యాత్మక భూములు, పట్టా లేకుండా రైతులు సాగు చేస్తున్న భూముల వివరాలతో పాటు గిరిజన రైతులు సాగు చేస్తున్న లక్షలాది ఎకరాల అటవీ హక్కు పత్రం కలిగి ఉన్న భూములను సైతం సర్వే చేసే బాధ్యతలను మళ్ళీ ఏఈఓ ల భుజాలపైనే వ్యవసాయ శాఖ వేసింది. వాలంటీర్ లతో పాటుగా ఏఈఓ లు సైతం ప్రస్తుతం పంట సర్వే లో బిజీగా ఉండటం, ఫార్మర్స్ రిజిస్ట్రీ లో రైతుల నమోదు, యూరియా యాప్ లో రైతుల మొబైల్ నంబర్ అప్డేషన్ వంటి పనుల్లో చేస్తున్నారు.

**పైరవీలు చేస్తూ.... పని భారం తప్పించుకుంటూ**

:వాలంటీర్ లు పంట సర్వేలో భాగంగా తీసిన పంట పొలాల ఫోటో లను పరిశీలన చేసే బాధ్యతను వ్యవసాయ శాఖ మండల వ్యవసాయ అధికారులు (ఏవో)లకు అప్పజెప్పింది. మండల వ్యవసాయ అధికారులు తమ ఉద్యోగ సంఘాల అధికారం, ధన రాజకీయ బలంతో ప్రభుత్వం తమకు ప్రభుత్వం అప్పజెప్పిన పంటల ఫోటో వెరిఫికేషన్ బాధ్యతలను రాష్ట్ర స్థాయిలో పైరవీ చేసి ఆ భారాన్ని కూడా ఏఈఓల పైకే బదిలీ చేయించడంతో రాష్ట్ర వ్యాప్తంగా ఏఈఓ లు భగ్గుమంటున్నారు. ఇప్పటికే వ్యవసాయ శాఖలో



49 రకాల పనుల భారం మోస్తూ శాఖకు వెన్నెముకగా నిలుస్తున్న ఏఈఓ వ్యవస్థ పై ఉన్నతాధికారులు జులుం అధికమైతే ఆ శాఖ చేపట్టే పథకాల అమలులో తీవ్ర విఘాతం తప్పదని వ్యవసాయ రంగ నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

**ఏవో కార్యాలయాల్లో బయోమెట్రిక్ హాజరు పెట్టాలి:**

మండల వ్యవసాయ అధికారులు (ఏవో) ల హాజరు పర్యవేక్షించడానికి ఎలాంటి యంత్రాంగం లేకపోవడం తో విధులు హాజరు విషయం లో మండలాల్లో ఏవో లు ఆడిందే ఆటలాగా సాగుతుంది అని రైతులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం తమకు కేటాయించిన విధులు సక్రమంగా నిర్వహించకుండా సమయానికి ఆఫీసుకు రాకుండా ఉద్యోగ సంఘాల పేరుతో రాజకీయ పైరవీలకు తెగబడ్డారని ఆరోపిస్తున్నారు. ఏ చిన్న పని కోసం ఏవో కార్యాలయాలకు వెళ్ళినా తిరిగి ఏఈఓ లను సంప్రదించాలని సూచిస్తున్నారని రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. లక్షల రూపాయల వేతనాలు తీసుకుంటూ తమకు అన్ని విధాలుగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని వాపోతున్నారు. అధికారులు క్రమం తప్పకుండా విధులకు హాజరు అయ్యేలా ప్రభుత్వం కఠిన నిబంధలు విధిస్తే కిందిస్థాయి సిబ్బందికి కలిగే ఇబ్బందులు ఏమిటో వారికి తెలుస్తుందన్నారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల తమ శాఖ పరిధిలోని అధికారులంతా సమయపాలన పాటించాలని పలుమార్లు హెచ్చరించి, సమయం దొరికినప్పడల్లా సంబంధిత కార్యాలయాలను ఆకస్మిక తనిఖీలు చేసి సమయానికి రాని సిబ్బందిపై చర్యలు తీసుకుంటున్నా మండల వ్యవసాయ అధికారుల తీరు మారడం లేదని ఆరోపిస్తున్నారు. మంత్రి తనిఖీలతో బెంబేలెత్తిన రాష్ట్ర ప్రధాన కార్యాలయాల్లో పనిచేసే ఉద్యోగులు విధులకు హాజరైతున్నా జిల్లాలలో పనిచేసే ఉద్యోగులు మాత్రం తమ సొంత పనులు పూర్తి ఐన తరువాతనే ఉద్యోగం అన్నట్లుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఏదేమైనా బాధ్యతాయుతంగా రైతాంగానికి సేవ చెయ్యాల్సిన అధికారులే ఇలా వీధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల రాష్ట్రంలో వ్యవసాయ రంగం కుంటు పడుతుందని పలు రైతు సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

# అధికారుల నిర్లక్ష్యంతో వాణిజ్య కేంద్రాలకు డొమెస్టిక్ గ్యాస్...

(మొదటి తరువాయి)

యుద్ధ ప్రభావం క్రూడ్ ఆయిల్ ధరలపై పడే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. దీని ప్రభావం భవిష్యత్తులో గ్యాస్ సిలిండర్ల ధరలు, సరఫరాపై పడే అవకాశముంది. ఇలాంటి సమయంలో గృహ వినియోగానికి కేటాయించిన సిలిండర్లు వాణిజ్య అవసరాలకు మళ్లిపోతే సామాన్య ప్రజలు మరింత ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

**ప్రజా సంఘాల డిమాండ్లు**

- రాష్ట్రంలో డొమెస్టిక్ సిలిండర్ల దుర్వినియోగంపై సమగ్ర తనిఖీలు చేపట్టాలి
- గ్యాస్ ఏజెన్సీలపై కట్టుదిట్టమైన పర్యవేక్షణ ఏర్పాటు చేయాలి
- వాణిజ్య అవసరాలకు డొమెస్టిక్ సిలిండర్లు సరఫరా చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలి
-గృహ వినియోగదారులకు సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలి

ప్రజా శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని ఇప్పటికైనా అధికార యంత్రాంగం నిద్ర మత్తును వీడి కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ప్రభుత్వం వెంటనే స్పందించి గ్యాస్ సరఫరా వ్యవస్థపై పర్యవేక్షణను కట్టుదిట్టం చేస్తేనే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని వారు పేర్కొంటున్నారు.


# మహేశ్వరం నూతన సీఐ రాఘవేందర్ రెడ్డిని సన్మానించిన కావలి దశరథ



**మహేశ్వరం, మార్చి 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండల కేంద్రంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన సీఐ ఎస్. రాఘవేందర్ రెడ్డిని పెద్దపులి నాగారం గ్రామ మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు కావలి దశరథ శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కావలి దశరథ మాట్లాడుతూ, “మహేశ్వరం మండలంలోని ప్రతి గ్రామంలో శాంతిభద్రతలు కాపాడుతూ ప్రశాంత వాతావరణం నెలకొల్పాలి. గ్రామాల్లో గంజాయి, డ్రగ్స్ వంటి వాటిని నిర్మూలించే చర్యలు తీసుకోవాలి. బెల్ట్‌షాపులు పెరగడం వల్ల మద్యం బానిసలు పెరుగుతున్నాయి. వాటిపై తగిన చర్యలు తీసుకోవాలి” అని నూతన సీఐ రాఘవేందర్ రెడ్డిని కోరారు.

# జగతి ఫౌండేషన్, సి1 ఇండియా భాగస్వామ్యంతో విద్యార్థులకు డిజిటల్ విద్య






**పాలపర్రు, మార్చి 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పాలపర్రు ఎస్.ఎన్. గవర్నమెంట్ హై స్కూల్‌లో శుక్రవారం “3సీ-- కేర్ ౹ కన్జర్వ్ ౹ కంప్యూట్” హోలిస్టిక్ స్టూడెంట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ ప్రారంభమైంది. జగతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో, సి1 ఇండియా సహకారంతో ఏర్పాటు చేసిన ఆధునిక కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా రూపొందించిన ఈ కార్యక్రమం ద్వారా డిజిటల్ విద్యతో పాటు వాతావరణ అవగాహన, ఆరోగ్యం, పోషకాహారం అంశాలపై విద్యార్థులకు మార్గదర్శకత్వం అందించనున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో నాలుగు ప్రభుత్వ పాఠశాలలను మూడేళ్ల పాటు దత్తత తీసుకుని 600 మందికి పైగా విద్యార్థులకు లబ్ధి చేకూరనుంది. సి1 ఇండియా ఎం.డి. ౘ కంట్రీ హెడ్ చంద్ర బొడ్డోజు నాయకత్వంలో, రాజేష్ తాతినేని (హెచ్.ఆర్. హెడ్), అర్పితా మెహతా (ప్రోగ్రామ్ మేనేజర్), సురేష్ రమేష్ (కాంపిటెన్సీ హెడ్), సుధ వేదురపర్తి (రిక్రూట్‌మెంట్ హెడ్), సామ్యూల్ జాన్ (పీఎంఓ) భాగస్వామ్యంతో ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది. ఈ సందర్భంగా ఎస్.ఎన్.జి.హెచ్.ఎస్. పాత విద్యార్థుల సంఘ కమిటీ సభ్యులు డా. ముద్దన రమేష్ బాబు, జంపని రామారావు, దొప్పలపూడి రమేష్ బాబు, పిన్నింటి సాంబశివరావు, చిమ్మినేని నరేష్, ఈదర బ్రహ్మానందం, రామినేని జయశ్రీలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే జగతి ఫౌండేషన్ బోర్డు సభ్యులు అబూ బేకర్, రామచంద్ర, కిరణ్‌కుమార్, తిరుపతి రెడ్డి హాజరై కార్యక్రమానికి విశిష్టతను చేకూర్చారు.

# బంగినిమటం ఫౌండేషన్ సేవలు అభినందనీయం

దండుమైలారం సర్పంచ్ ఇదులకంటి నరేష్ గౌడ్



**దండుమైలారం, మార్చి 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** దండుమైలారం జడ్‌పిహెచ్ఎస్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు వి. గోవర్ధన్ ఆధ్వర్యంలో శుక్రవారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బంగినిమటం ఫౌండేషన్ ఆధ్వర్యంలో గత సంవత్సరం పదవ తరగతిలో 500కు పైగా మార్కులు సాధించిన టాపర్ ఐదుగురు విద్యార్థులకు అవార్డులు, రివార్డులు అందజేశారు. ప్రస్తుత పదవ తరగతి విద్యార్థులకు, అలాగే పాఠశాల విద్యార్థులకు భవిష్యత్తులో మరిన్ని ప్రోత్సాహకాలు అందజేస్తామని ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు. గతంలో కూడా ఫౌండేషన్ సభ్యులు వినయ్, రవికుమార్ మరియు వారి కుటుంబ సభ్యులు పాఠశాల కోసం కుర్చీలు, మైక్ సెట్, ఐడీ కార్డులు, స్టడీ మెటీరియల్ అందజేశారు. భవిష్యత్తులో పాఠశాల అభివృద్ధికి మరిన్ని సేవలు అందిస్తామని వారు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గ్రామ సర్పంచ్ ఇదులకంటి నరేష్ గౌడ్ మాట్లాడుతూ, “బంగినిమటం ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థుల అభివృద్ధి, పాఠశాల ఉన్నతి కోసం చేస్తున్న సేవలు అభినందనీయం” అని పేర్కొన్నారు. అనంతరం సర్పంచ్ మరియు అతిథుల చేతుల మీదుగా సైన్స్ ల్యాబ్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ విజయలక్ష్మి, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా రైతులకు ప్రత్యేక శుభాకాంక్షలు

రైతు కమిషన్ సభ్యురాలు భవానీ రెడ్డి



**హైదరాబాద్, మార్చి 7(నీలగిరి ఎక్స్‌ప్రెస్):** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రైతు కమిషన్ సభ్యురాలు భవానీ రెడ్డి మహిళామణులకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. ఈ ఏడాది ఐక్యరాజ్యసమితి మహిళా రైతు సంవత్సరంగా ప్రకటించడం శుభపరిణామమని ఆమె పేర్కొన్నారు. మహిళా లేనిదే మనుగడ లేదని, ఇంటి నుండి పంట పొలం వరకు మహిళా చేయి పడనిదే ఏ పని ముందుకు సాగదని అన్నారు. విద్య, వైద్య, క్రీడా, శాస్త్ర, సాంకేతిక రంగాల్లో మహిళలు రాణిస్తున్నారని, రాజకీయాల్లో కూడా తమ వంతు పాత్ర పోషిస్తూ ముందుకు సాగుతున్నారని వివరించారు. వ్యవసాయ రంగంలో మహిళల పాత్ర వర్ణించలేనిదని, విత్తనం వేసినప్పటి నుండి పంట కోసే వరకు మహిళా రైతులే ముందుంటారని చెప్పారు. ప్రపంచంలో మహిళా రైతుల సంఖ్యను 4 శాతం పెంచగలిగితే 150 మిలియన్ ప్రజలకు అన్నం పెట్టగలమని, అధిక దిగుబడి సాధించడంలో మహిళా రైతులదే నేర్పరితనం అని భవానీ రెడ్డి పేర్కొన్నారు. భూ హక్కు, విత్తన హక్కు వంటి అంశాలపై మహిళా రైతులు చూపుతున్న ఆసక్తి ప్రశంసనీయం అని, మార్కెటింగ్ విధానంలో కూడా మహిళలు తమ ప్రతిభను నిరూపిస్తున్నారని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళలకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారని, అమలవుతున్న సంక్షేమ పథకాలు దీనికి నిదర్శనమని తెలిపారు. మహిళా దినోత్సవం, మహిళా రైతు సంవత్సరాన్ని పురస్కరించుకుని మరోసారి మహిళామణులకు శుభాకాంక్షలు తెలిపారు.

# ఉపాధి హామీ కూలీలకు ఎండదెబ్బ తగలకుండా జాగ్రత్తలు

-- సర్పంచ్ పల్లెర్ల వెంకటేశ్ గౌడ్



**ఎలిగేడు, మార్చి 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వేసవి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ఉపాధి హామీ కూలీలకు ఎండదెబ్బ తగలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సర్పంచ్ పల్లెర్ల వెంకటేశ్ గౌడ్ సూచించారు. శనివారం నర్సాపూర్ గ్రామంలో కూలీలకు మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఉదయాన్నే పనులు ప్రారంభించి ఎండ తీవ్రత పెరగకముందే ముగించుకోవాలని, పనిచేసే సమయంలో తలకు టవల్ కట్టుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో కిరణ్, పంచాయతీ కార్యదర్శి, ఫీల్డ్ అసిస్టెంట్, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

# నిరుపేదలకు సొంత ఇంటి కల నెరవేర్చడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం

-కొండ్రిగానిబోడ్ తండా గ్రామ పంచాయతీలో నూతన ఇందిరమ్మ ఇండ్లు గృహప్రవేశం
- ఎమ్మెల్యే - శ్రీ కసిరెడ్డి నారాయణరెడ్డి



**కడ్తాల్, మార్చి 7 ( నీలగిరి ఎక్స్ ప్రేస్ ) :** నిరుపేదలకు సొంత ఇల్లు కల్పించడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా కడ్తాల్ మండల కేంద్రం, కొండ్రిగానిబోడ్ తండా గ్రామ పంచాయతీలో లబ్ధిదారులు భానావత్ మేగ్యా మరియు భానావత్ రాములు నూతన నిర్మాణమైన ఇందిరమ్మ ఇల్లు భవనాలను ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించి గృహప్రవేశం చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో పేదలందరికీ గౌరవప్రదమైన జీవనం కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని అమలు చేస్తోందన్నారు. ఇల్లు లేని ప్రతి నిరుపేద కుటుంబానికి దశలవారీగా సొంత ఇల్లు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. పేదల సొంత ఇంటి కల నేరవేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలుచేస్తోందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో నిరుపేదలకు ఇల్లు కట్టించి వారి కళ్ళలో ఆనందం చూడాలని, స్వంత ఇంటి కళ నిజం చేయాలని ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల గృహ నిర్మాణ పథకం విజయవంతంగా ముందుకు సాగుతోందనీ, రానున్న రోజుల్లో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇల్లు మంజూరు చేస్తామని అన్నారు. మిగతా లబ్ధిదారులందరు ప్రభుత్వ ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకుని త్వరగా ఇళ్లు నిర్మించుకోవాలన్నారు. పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వం ధ్యేయమని అన్నారు. అర్హులైన లబ్ధిదారులు ప్రభుత్వం అందిస్తున్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ ఇళ్లను పూర్తి స్థాయిలో నిర్మించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, ఆమనగల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాట నర్సింహా, తండా గ్రామపంచాయతీ సర్పంచ్ భానావత్ బిక్కు శారద నాయక్, ఉప సర్పంచ్ సభావత్ యశోద రాజు, కడ్తాల్ సర్పంచ్ రాయికంటి బిక్షపతి, కడ్తాల్ ఉపసర్పంచ్ ఈరెడ్డి యాదగిరి రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు బీచ్యా నాయక్, అధికారులు సీఈవో కృష్ణారెడ్డి, హౌసింగ్ బోర్డ్ అధికారులు పీడీ చంప్లా నాయక్, డీఈ శైలజ, ఏఈ క్రాంతి, ఎంపీడీవో సుజాత, తండా సెక్రటరీ కుమార్ మరియు నాయకులు గురిగళ్ళ లక్ష్మయ్య, శ్రీను, శంకర్, నెజ్య నాయక్, రామకృష్ణ, చందోజీ, రమేష్, సేవ్య, ఇమ్రాన్ బాబా, బోసు రవి, రాజేందర్ గౌడ్, రంగా, హరి మరియు తండా ప్రజలు పాల్గొన్నారు.

# మహిళామూర్తులకిచ్చే గౌరవం ఇదేనా ?

## (అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా)

సమాజంలో నేడు ప్రపంచవ్యాప్తంగా పురుషులతో సమానంగా ప్రతిపనిచేస్తూ ధైర్యంగా ముందుకు వెళ్తున్నారన్న విషయం విశ్వమెరిగిన నగ్నసత్యం.కానీ ఇప్పటికీ పురుషులతో సమానంగా గౌరవమర్యాదలు అందుకోవటం లేదన్నది వాస్తవమని చెప్పకతప్పదు.కవులు,కళాకారులు స్త్రీల గురించి రచనలుచేస్తూ వర్ణిస్తుంటే మైమరచిపోయే విధంగా ఉంటాయి.మార్చి 8 వచ్చిందంటేచాలు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఎక్కడికక్కడ సభలు,సమావేశాలు ఏర్పాటుచేసి ఉపన్యాసాలు ఇస్తుంటే క్షణికానందం కలిగిస్తున్నాయి తప్ప మరొకటి లేదన్నది ముమ్మాటికి వాస్తవం.ప్రభుత్వాలు సైతం మహిళాక్షేమం,సంక్షేమం,సాధికారత గురించి పలుచట్టాలను చేసినా అనుకున్నంతరీతిలో అమలుకు నోచుకోలేక కాగితాలకే పరిమితం అవుతున్నాయని చెప్పవచ్చు.లేకపోతే చట్టసభలలో వైరుధ్యం ఎందుకు ?అరకొరగా అవకాశాలు వచ్చిన ఆడచాటు మగపెత్తనం ఏంటి ?ఎన్నడు స్వతంత్ర నిర్ణయాలు తీసుకునే స్వేచ్ఛ వస్తుంది? ఇంకా భయానకంగా లైంగికదాడులు,యాసిడ్ దాడులు,వేధింపులు,చీదరింపులు, ప్రేమపేరుతో హత్యలు ఎందుకు జరుగుతున్నాయి?ఇవన్నీ కూడా జవాబులేని ప్రశ్నలుగానే మిగిలిపోతున్నాయి.

మహిళా దినోత్సవాన్ని రాష్ట్ర,కేంద్ర ప్రభుత్వాలతోపాటు ప్రపంచవ్యాప్తంగా పలుసంస్థలు అంగరంగవైభవంగా కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు.ఎన్నో హామీలు,అవార్డులు,ప్రశంసలు,పొగడ్తలతో ముంచెత్తుతు ఒకరోజు జరుపుకునే పండుగలా చేశారన్నది నిజంకాదా ?ఎందుకు ఇలాంటి రోజును జరుపుకోవాలి ?దానివెనకాల ఉన్న చారిత్రక నేపథ్యాన్ని పరిశీలిస్తే మహిళాశక్తి ఏమిటో అవగతమవుతుంది.ఆడది అంటే ఆద పరాశక్తి అని,పురుషులతో పోల్చితే ఎంతో మనోధైర్యం కలిగి,సహనంలో సైతం తమకెవ్వరు సాటిలేరని నిరూపిస్తూ మానవమనుగడకు కారకులవుతున్నారు.

వాస్తవానికి మహిళలపై జరుగుతున్న వివక్షతకు వ్యతిరేకంగా మహిళా హక్కులపట్ల అవగాహన కల్పించడంతోపాటు,మహిళా సాధికారతకు ప్రపంచవ్యాప్తంగా మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జరుపుకోవడం జరుగుతుంది.ఒక్కసారిగా చరిత్రలోకి తొంగిచూస్తే ఒకశతాబ్దం క్రితం 1908లో న్యూయార్క్ లోని మహిళాకార్మికులు తక్కువ పనిగంటలు,మెరుగైన జీతాలు,పురుషులతో సమానంగా ఓటుహక్కు పొందటానికి 15000 మహిళామణులతో కార్మికఉద్యమం చేపట్టారు.ఇది ప్రపంచదేశాల మహిళకు ఆదర్శప్రాయం అయింది.1909లో అమెరికాలోని సోషలిస్ట్ పార్టీ ఫిబ్రవరి 28న జాతీయ మహిళాదినోత్సవం జరపాలని ప్రకటించింది.1910లో జర్మనీకి చెందిన సోషల్ డెమొక్రటిక్ పార్టీకి చెందిన మహిళా నాయకురాలు క్లారా జెట్కిన్ ఉపన్యసిస్తూ ప్రతిసంవత్సరం ఏదోఒక రోజును అంతర్జాతీయ స్థాయిలో మహిళా దినోత్సవాన్ని జరుపుకోవాలని కోపెన్ హేగన్ లో జరిగిన ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆఫ్ వర్కింగ్ ఉమెన్ సదస్సులో ప్రతిపాదన చేయడంజరిగింది.ఈ ప్రతిపాదనకు ప్రపంచంలోని 17దేశాల నుండి 100 మహిళలు ఏకగ్రీవంగా అంగీకరించడం గమనార్హం.ఆతర్వాత 1911మార్చి 19న తొలిసారిగా ఆస్ట్రియా,డెన్మార్క్,జర్మనీ, స్విట్జర్లాండ్ దేశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జరుపుకోవడం ప్రారంభించారు. రష్యా మహిళలు "ఆహారం - శాంతి"అనే నినాదంచేస్తూ మార్చి 8న సమ్మె ప్రారంభించారు.నాలుగురోజుల తర్వాత సమ్మె ప్రభావంవలన రష్యా సామ్రాట్ నికోలస్ 2 సింహాసనం వదులుకోవడం,ఆతర్వాత ఆస్థానంలో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడి మహిళలకు ఓటుహక్కు కల్పించింది.ఇది మహిళామణులు సాధించిన విజయం కావడంతో 1913నుండి మార్చి 8న మహిళా దినోత్సవం జరుపుకోవాలని నిర్ణయించారు. ఒక్కొక్కదేశంలో






ఒక్కోవిధంగా అంటే కొన్నిదేశాల్లో సివిల్ అవేర్నెస్ డే,మరికొన్ని దేశాల్లో యాంటీ సెక్సీజమ్ డే,ఇంకొన్ని దేశాలలో మహిళా వివక్ష వ్యతిరేక దినోత్సవంగా జరుపుకోవడం ప్రారంభించారు.తర్వాతి కాలంలో ఐక్యరాజ్యసమితి 1975 మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం అధికారికంగా ప్రకటించి,రెండు థిమ్ లను ప్రవేశపెట్టింది.ఇందులో మొదటిది గతాన్ని వేడుకగా చేసుకోవడం,రెండవది భవిష్యత్తుకు ప్రణాళికలు రచించుకోవాలని సూచించింది.


2011లో శతాబ్ది వేడుకల సందర్భంగా అమెరికాలో అప్పటి అధ్యక్షుడు బరాక్ ఒబామా మార్చినెలను మహిళాచరిత్రగా ప్రకటించడం గమనార్హం. భారతదేశంలో సరోజినినాయుడు జయంతిని పురస్కరించుకుని ఆమెజన్మదినం గుర్తుగా ఫిబ్రవరి 13 జాతీయ మహిళా దినోత్సవంగా జరుపుకుంటూ,మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించడం జరుగుతుంది.ఇంకా దేశంలో మహిళలగురించి అందరికంటే ఎక్కువగా "ఎక్కడైతే స్త్రీలు పూజింపబడతారో అక్కడ దేవతలు కొలువై ఉంటారని" సంబోధిస్తుంటారు.అంతెందుకు దేశ తొలిప్రధాని జవహర్లాల్ నెహ్రూ "స్త్రీల జీవన ప్రమాణాలు దేశ అభ్యున్నతికి కొలమానాలని కొనియాడారు".ఇంకా పుట్టుకకు,అస్తిత్వానికి, పునరుజ్జీవనానికి,కొనసాగింపుకు స్త్రీయే ఆధారం,అలాగే మనిషి మనుగడకోసం స్త్రీ అవసరాన్ని గుర్తించి స్మరించుకోవాలి.అందుకే మహిళలశ్రమను గుర్తించడానికి ఇలాంటి దినోత్సవాలు జరుపుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉన్నది.

స్వాతంత్ర్యం వచ్చాక స్త్రీయొక్క ప్రాముఖ్యతను గుర్తించి "ఇల్లాలి చదువు-ఇంటికి వెలుగు" అనే నినాదంతో విద్యను అందించడానికి కృషిచేశారు.వాటి ఫలితంగానే ప్రస్తుతం అవని నుండి అంతరిక్షం వరకు అన్నిరంగాలలో స్త్రీలు తమప్రావీణ్యతను నిరూపించుకుంటూ వస్తున్నారు.కానీ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు సైతం మహిళలకోసం పలుచట్టాల రూపకల్పన చేసినప్పటికీ కార్పొరేట్ రంగంలో,క్రీడల్లో,రాజకీయాలలో,చలనచిత్ర పరిశ్రమలో,అన్నిరకాల ప్రైవేటు,ప్రభుత్వ ఉద్యోగాలలో వివక్షతకు లోనవుతూ వస్తున్నారు.అందుకే నిర్భయ,దిశ లాంటి చట్టాలు వచ్చినకూడా మహిళలపై లైంగికదాడులు,అత్యాచారాలు,వేధింపులు,చులకన భావంతో చూడటం జరుగుతున్నాయంటే దేనికి నిదర్శనమో అర్థంకాకతప్పదు.అంతెందుకు పురుషులతో సమానంగా రిజర్వేషన్ కల్పించాలని చట్టాలు చేస్తున్నప్పటికి చట్టసభలలో వారిసంఖ్య ఎంత? అంటే సమాధానంలేని ప్రశ్నగా మిగిలిపోతుంది.అతివలు ఆకాశంలో సగం అంటారు కానీ హక్కులకల్పనలో మాత్రం ఎలా ఉంటుందో వేరే చెప్పనక్కరలేదు అందరికీ తెలిసిన విషయమే.ఏదిఏమైనప్పటికీ మహిళామూర్తులు ఎక్కడ ధైర్యం కోల్పోకూడదు.మనోధైర్యంతో ముందుకు వెళుతూ మహిళాదినోత్సవం లాంటి వేడుకలను ఘనంగా నిర్వహించుకుంటూ,సాధించిన లక్ష్యాన్ని నెమరువేసుకుంటూ,వర్తమాన విషయాలను పరిశీలించి,చర్చిస్తూ,భవిష్యత్ ప్రణాళికల రూపకల్పన గావించుకొని,అమలుకై మార్గనిర్దేశం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

ఒక్కసారిగా రాణిరుద్రమదేవి,ఝాన్సీ లక్ష్మీబాయి ,మదర్ తెరిసా,సావిత్రిబాయి ఫూలే,సరోజినీనాయుడు,చాకలి ఐలమ్మ,కల్పనాచావ్లా,ఇందిరాగాంధీ,షీలాదీక్షిత్,సుష్మాస్వరాజ్,మాయావతి,ఉమాభారతి,సోనియాగాంధీ,మమతాబెనర్జీ,జయలలిత,ప్రతిభాపాటిల్,పి.టి. ఉష,కరణం మల్లేశ్వరి,పీవీ సింధు,సైనా నెహ్వాల్,చందా కొచ్చర్,ప్రపంచ కప్ సాధించిన మహిళా క్రికెట్ టీం లాంటి అత్యున్నత శిఖరాలను అధిరోహించిన మహిళల గురించి చర్చిస్తూ,రాబోయే తరాలకు స్ఫూర్తిదాయకమైన సమాచారం ఇస్తూ,అనుకున్న లక్ష్యాలకు పాటుపడుతూ ముందుకుసాగాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

స్వాతంత్రంవచ్చి ఇన్నేళ్లయినా చిన్నచిన్న పల్లెలలో,తండాల్లో బాలికలు,మహిళలపట్ల వివక్షత కొనసాగుతూనేఉన్నది.ఇప్పటికీ కొన్నిచోట్ల బాల్యవివాహాలు జరగడం,పురిటిలోనే ఆడపిల్లలను చంపడం, పేదరికంతో అమ్మాయిలను చదువుకు దూరంచేయడం,నిరక్షరాస్యత కారణంగా తమ సంతానంలో అబ్బాయిలకంటే అమ్మాయిలు తక్కువ ప్రాధాన్యతనివ్వడం అక్కడక్కడా చూడవచ్చు.ఈ విషయంలో రాష్ట్ర,కేంద్ర ప్రభుత్వాలు ప్రధానంగా చొరవచూపి అరికడుతూ,మహిళలపట్ల వివక్షతను రూపుమాపే విధంగా చర్యలు తీసుకుంటూ,సమన్యాయం,సమాన అవకాశాలు ఇచ్చేవిధంగా ముందుకు సాగాలని,అదేతరహాలో పురుషులుసైతం అంతేప్రోత్సాహం అందించాలని ఆశిద్దాం.

డా.పోలం సైదులు
తిరుమలగిరి,వంగూర్ మండలం.
9441930361.



# గుర్కా మంగమ్మ చిత్రపటానికి నివాళి

కడ్తాల్ మాజీ జెడ్పీటీసి, రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జర్పుల దశరథ్ నాయక్



**కడ్తాల్, మార్చి 7 ( నీలగిరి ఎక్స్ ప్రేస్ )**
కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్ యాదవ్ మాతృమూర్తి మంగమ్మ ఇటీవల కన్నుమూశారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని సంతాపం తెలియజేసిన కడ్తాల్ మాజీ జెడ్పీటిసి లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు జర్పుల దశరథ్ నాయక్ శనివారం మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ స్వగృహంలో వెళ్లి మాతృమూర్తి మరణం పట్ల కడ్తాల్ మాజీ జెడ్పీటిసి దశరథ్ నాయక్...గుర్కా మంగమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.కన్నతల్లి మరణంతో శోకతప్తులైన జైపాల్ యాదవ్ ని మర్యాదపూర్వకంగా పలకరించడం జరిగింది . ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, డైరెక్టర్ జోగు వీరయ్య, కడ్తాల్ గ్రామ కమిటీ అధ్యక్షుడు రామకృష్ణ, నాయకులు మంగళపల్లి నరసింహ, కోట్యా, మహేష్, రాజశేఖర్, ప్రవీణ్ కుమార్, రాజేందర్ యాదవ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# 9వ వార్డులో ప్రజాపాలన -ప్రగతి ప్రణాళిక



**షాద్‌నగర్, మార్చి 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పట్టణంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో భాగంగా షాద్‌నగర్ మున్సిపాలిటీలో ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక కార్యక్రమం కొనసాగుతోంది. ఈ క్రమంలో శనివారం 9వ వార్డులోని విజయనగర్ కాలనీ హనుమాన్ దేవాలయం వెనక పరిసరాలను శుభ్రపరిచే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 9వ వార్డు కౌన్సిలర్ ప్యాట అశోక్ మాట్లాడుతూ, "ప్రజా సమస్యల పరిష్కారానికి పెద్దపీట వేస్తూ ప్రజాపాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా శుభ్రత కార్యక్రమాలను చేపట్టాం. కాలనీలో బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకూడదని ప్రజలకు అవగాహన కల్పించాం" అని తెలిపారు.కార్యక్రమంలో స్థానిక వార్డు ఆఫీసర్, ఆర్‌పి, మున్సిపల్ జవాన్లు, మున్సిపల్ సిబ్బంది, వాటర్‌మెన్, కాలనీవాసులు, యువకులు, యువజన సంఘాల నాయకులు పాల్గొని విజయవంతం చేశారు.

# మహిళలు ఉన్నత చదువులు చదివి అన్ని రంగాల్లో రాణించాలి

- మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ తల్లోజు గీత




**ఆమనగల్లు, మార్చి 7(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
సమాజంలో ప్రతి ఒక్క అమ్మాయి ఉన్నత చదువు చదవడంతో పాటు, అన్ని రంగాల్లో రాణించాలని ఆమనగల్లు మున్సిపాలిటీ వైస్ చైర్ పర్సన్ తల్లోజు గీత అన్నారు. శనివారం మున్సిపల్ కేంద్రంలోని అరబిందో హైస్కూల్లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు వైస్ చైర్ పర్సన్ తల్లోజు గీత, కౌన్సిలర్ దోలి హాజరయ్యారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ గీత మాట్లాడుతూ.. సమాజంలో మహిళల పాత్ర చాలా గొప్పదని, మహిళలు లేకపోతే మానవ మనుగడ లేదన్నారు. నేటి సమాజంలో పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ సుధీర్ రెడ్డి, అకాడమిక్ అడ్వైజర్ ప్రేమ కుమారి, ప్రిన్సిపాల్ నాగమణి, ఉపాధ్యాయ బృందం రాధా,సునీత, సౌమ్య ,సౌజన్య, ప్రియాంక,బోడ నరేష్, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు


# 'ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక'లో అందరూ భాగస్వాములు కావాలి

- మున్సిపల్ వైస్‌చైర్మన్ అందె మోహన్



**షాద్‌నగర్, మార్చి 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక'లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని షాద్‌నగర్ మున్సిపల్ వైస్‌చైర్మన్ అందె మోహన్ పిలుపునిచ్చారు. శనివారం 14వ వార్డులో ప్రగతి ప్రణాళిక చర్యలలో భాగంగా ఆయన స్వయంగా పరిశుద్ధ కార్మికులతో కలిసి శ్రమదానం చేశారు. సిబ్బందికి ప్రోత్సాహకరంగా వైస్‌చైర్మన్ మోహన్ స్వయంగా చెత్తను ఊడ్చి, చేత పట్టి తొలగించారు. ఆడుతూ పాడుతూ శ్రమదానం చేయడం ద్వారా కార్యక్రమానికి ఆయన హైలెట్‌గా నిలిచారు. పురపాలకంలో 99 రోజులపాటు ఈ కార్యక్రమాన్ని స్థానికులతో కలిసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా అందె మోహన్ మాట్లాడుతూ, "వివిధ వార్డుల్లో పారిశుధ్య కార్యక్రమాలు, వీధి దీపాలు, తాగునీటి సమస్యలు తలెత్తకుండా పనులను అందరూ పర్యవేక్షించాలి. పారిశుధ్య నిర్వహణలో పాలకమండలి సభ్యులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. రహదారులపై చెత్త పేరుకుపోకుండా చూడాలి. డ్రైనేజీ కాలువల్లో మట్టిని ఎప్పటికప్పుడు తొలగించాలి. ముఖ్యంగా వర్షాకాలంలో నీరు నిలిచే గుంతలను గుర్తించి తక్షణమే పరిష్కార చర్యలు చేపట్టాలి" అని సూచించారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా పారిశుధ్య పనులను వేగవంతం చేయాలని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానికులు రాము, గోపాల్, కొంద యాదయ్య, పాషా, నౌషాద్, రవి, చిన్న, రాంపల్లి కృష్ణ, నందిగామ శ్రీశైలం, శ్రీదేవి, వార్డు ఆఫీసర్ అనూష, అంగన్వాడీ టీచర్ శోభ తదితరులు పాల్గొన్నారు.

## ఓ మగువ నీకు వందనం



మహిళా అంటే ఒక శక్తి
సృష్టికి మూలం మహిళ
మహిళతోనే మనుగడ
మరువలేము నీ త్యాగం!!

ఆమె సహనానికి మారుపేరు
అక్క చెల్లి అమ్మగా తనదైన పాత్ర
మహిళా నీకు శతకోటి వందనాలు
ఆత్మగాళ్ళు మనసుకలిగిన మహిళ!!

ఆమె ఒక అమ్మ ఒక నాన్న
ఆమె పొద్దుతో పోటీ పడుతుంది
కాలంతో పోటీ పడుతుంది ఆమె
ఈ జగతిన సరిలేరు నీకెవ్వరు!!

ప్రేమ త్యాగం సహనం ఆమె
మగువ మనుగడకే ప్రాణం పోసేది
అవసరానికి ఆసరాగా నిలిచే ధీరత్వం
భూమాతకు ఉండే సహనం ఆమెది!!

అలుపెరుగని ఓర్పు ఆమెది
నిరంతర శ్రమజీవి ఆమె
ఓ మగువా నీకు వందనం
ఆమెతోనే మన జీవన ప్రయాణం!!

మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా

రచన:
దేవులపల్లి రమేశ్
కలం: వామిక శ్రీ వర్ష
సిద్దిపేట, నంగునూర్
చరవాణి :9963701294



## లోయపల్లిలో "ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక" 99 రోజుల కార్యక్రమానికి శ్రీకారం



**లోయపల్లి, మార్చి 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక" 99 రోజుల కార్యచరణ కార్యక్రమాన్ని శనివారం లోయపల్లిలో ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా 3వ వార్డు సభ్యుడు కొర్ర బాలు నాయక్ మాట్లాడుతూ, "ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తోంది. ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించడం, ప్రభుత్వ సేవలను సమర్థవంతంగా ప్రజలకు చేరవేయడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యం" అని పేర్కొన్నారు. ఎమ్మెల్యే మాల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ, "ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా అధికారులు కృషి చేయాలి. గ్రామ స్థాయి నుండి పట్టణ స్థాయి వరకు అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలి" అని సూచించారు. ప్రజా పాలన కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వెంటనే పరిష్కరించే చర్యలు ప్రభుత్వం చేపడుతోందని, ప్రజలు కూడా ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఆంగోత్ రఘురామ్ నాయక్, వార్డు సభ్యులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## తూప్రాన్ మున్సిపాలిటీలో ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక, మహిళా దినోత్సవం వేడుకలు




**తూప్రాన్, మార్చి 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా శనివారం తూప్రాన్ మున్సిపాలిటీలో పలు వార్డుల్లో ప్రత్యేక శానిటేషన్ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మున్సిపల్ కమిషనర్ పాతూరి గణేష్‌రెడ్డి ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయంలో వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా నూతన మున్సిపల్ చైర్‌పర్సన్ బొంది రజని, వైస్‌చైర్‌పర్సన్ కొక్కొండ సమత, మహిళా పాలకవర్గ సభ్యులు, కార్యాలయ మహిళా సిబ్బంది, మెప్మ మహిళా సిబ్బంది, పారిశుధ్య మహిళా కార్మికులను శాలువాలతో సన్మానించి గౌరవించారు.

## అహ్మదిపూర్ నుండి భద్రాచలానికి గోటి తలంబ్రాలు




**సిద్దిపేట, మార్చి 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** భద్రాచల రాములోరి కళ్యాణానికి అందించే గోటి తలంబ్రాల కార్యక్రమం శనివారం సిద్దిపేట జిల్లా అహ్మదిపూర్ గ్రామంలో ఘనంగా జరిగింది. శ్రీరామకోటి భక్త సమాజం సంస్థ వ్యవస్థాపకుడు, అధ్యక్షుడు, భక్తిరత్న జాతీయ అవార్డు గ్రహీత రామకోటి రామరాజు ఆధ్వర్యంలో భద్రాచలం నుండి తీసుకొచ్చిన గోటి తలంబ్రాలను కలశాలలో నింపి రామనామ స్మరణ చేస్తూ గ్రామ పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. కాషాయ జెండాలు, కలశాలతో భారీ ర్యాలీ హనుమాన్ గుడి నుండి రామాలయానికి చేరి వడ్లను ఓలిచే కార్యక్రమాన్ని ప్రారంభించారు. రామకోటి రామరాజు భక్తులతో కలిసి మూడు గంటలపాటు రామనామ స్మరణ చేస్తూ గోటితో వడ్లను ఓలిచి తలంబ్రాలుగా మార్చారు. అనంతరం భక్తులు తలంబ్రాలను రామకోటి రామరాజుకు అందజేశారు. ఇప్పటివరకు నాలుగు సార్లు భద్రాచల కళ్యాణానికి మూడు క్వింటాళ్ల గోటి తలంబ్రాలను తెలంగాణ రాష్ట్రం నుండి అందించామని రామకోటి రామరాజు తెలిపారు. "మేము భద్రాచలం వెళ్లలేకపోయినా, మేము ఓలిచే తలంబ్రాలు రామయ్య కళ్యాణానికి చేరడం ఎన్నో జన్మల పుణ్యఫలం" అని ఆయన పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం మా గ్రామం నుండి భద్రాచల రాముని కళ్యాణానికి తలంబ్రాలు అందిస్తామని భక్తులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రామాలయ భక్తబృందం సభ్యులు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

## నల్లబెల్లం, పట్టిక పట్టివేత



**కడ్తాల్, మార్చి 7 ( నీలగిరి ఎక్స్ ప్రేస్ ) :** రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం వాసుదేవ్ పూర్ గ్రామంలో రాష్ట్ర టాస్క్ ఫోర్స్ టీమ్, ఎస్ ఓటి టీం, అమనగల్ అబ్కారి శాఖ పోలీసుల సంయుక్త ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. సారా తయారు కోసం వాడే ముడి పదార్థాలు నల్లబెల్లం, పట్టిక, ఆలం ను ఓ కొల్లఫారంలోలో భారీ మొత్తంలో డంపు చేశారన్న సమాచారంతో దాడులు నిర్వహించించారు. ఈ సోదలో నల్ల బెల్లం 30కేజీల చొప్పున మొత్తం 900కేజీలు సిజ్ చేశారు. ఆలం పట్టిక రెండు బ్యాగులు మొత్తం 100కేజీలు, సారాయి 10లీటర్లు సిజ్ చేశారు. నిందితులు రమేష్ చెరుకు పల్లి, పడమటి తండా డిండి మండలం, నల్గొండ జిల్లా అనే వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు అమనగల్ అబ్కారి పోలీసులు తెలిపారు.

## అంగన్వాడీ సమస్యలు పరిష్కరించాలని మంత్రికి వినతి



**నల్లగొండ ,మార్చి 7 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడి సమస్యల ను ప్రభుత్వంతో చర్చించి సమస్యలను పరిష్కరిస్తామని రాష్ట్ర రోడ్లు భవనాలు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. అంగన్వాడి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించాలని కోరుతూ జిల్లా అంగన్వాడీ టీచర్స్ ఆయాల సంఘం అధ్యక్షురాలు జొన్నలగడ్డ వెంకటరమణ, జిల్లా సంఘ సభ్యులు కలిసి శనివారం మంత్రికి వినతి పత్రం అందజేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడీల భవనాల మరమ్మత్తు కోసం 2 లక్షల కేటాయించామని, 60 సంవత్సరాలు నిండిన వారికి రిటైర్మెంట్ బెన్ఫిట్ వర్తింప చేస్తామని, త్వరలో టీచర్లు ఆయాల నియామకాలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి పుట్టా సునీత, రాజ్యం, అరుణ, సుశీల, లావణ్య, సైదమ్మ, కవిత, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

# మహిళా అభివృద్ధి లేకుండా దేశాభివృద్ధి అసాధ్యం




ప్రతి సంవత్సరం మార్చి 8న ప్రపంచవ్యాప్తంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జరుపుకుంటారు. మహిళల గౌరవం, సమాన హక్కులు మరియు సాధికారతకు ప్రాధాన్యం ఇచ్చే ఈ రోజు సమాజానికి ఒక ముఖ్యమైన సందేశాన్ని అందిస్తుంది. మహిళలు కుటుంబానికి మాత్రమే కాకుండా దేశాభివృద్ధికి కూడా ప్రధాన శక్తిగా నిలుస్తున్నారు. నేటి కాలంలో మహిళలు విద్య, వైద్యం, విజ్ఞానం, రాజకీయాలు, క్రీడలు, వ్యాపారం వంటి ప్రతి రంగంలో తమ ప్రతిభను చాటుతూ ముందుకు సాగుతున్నారు. ఒకప్పుడు ఇంటికే పరిమితమయ్యే మహిళలు ఇప్పుడు ప్రపంచ వేదికలపై తమ సామర్థ్యాన్ని నిరూపిస్తూ సమాజానికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు. మహిళల ఆరోగ్యం, భద్రత మరియు సాధికారత కోసం ప్రభుత్వాలు కూడా పలు కీలక నిర్ణయాలు తీసుకుంటున్నాయి. ముఖ్యంగా సర్వైకల్ క్యాన్సర్ నివారణ కోసం హ్పూవి వ్యాక్సిన్‌ను అందుబాటులోకి తీసుకురావడం మహిళల ఆరోగ్య పరిరక్షణలో ఒక ముఖ్యమైన అడుగుగా భావిస్తున్నారు. ఇదే కాకుండా మహిళల ఆర్థిక స్వావలంబన కోసం పలు అభివృద్ధి పథకాలు అమలు అవుతున్నాయి. మహిళల అభివృద్ధి అనేది కేవలం ఒక వర్గానికి సంబంధించిన విషయం కాదు; అది మొత్తం సమాజ ప్రగతికి పునాది. మహిళలు బలంగా ఉంటేనే కుటుంబం బలంగా ఉంటుంది, కుటుంబం బలంగా ఉంటేనే దేశం అభివృద్ధి చెందుతుంది. అందుకే మహిళల గౌరవం, భద్రత మరియు సమాన అవకాశాలు ప్రతి సమాజంలో ఉండాలి. ఈ అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళల శక్తిని గౌరవిస్తూ, వారికి మరింత అవకాశాలు కల్పించే సమాజాన్ని నిర్మించుకోవడం మనందరి బాధ్యత.

జి. నాగు
జర్నలిస్ట్



# ‘మగువా లోకానికి తెలుసా నీ విలువ”




ప్రపంచంలో ప్రతి మనిషి జీవితంలో మగువకు ఒక ప్రత్యేకమైన స్థానం ఉంది. మగువ అనేది కేవలం ఒక వ్యక్తి కాదు; ఆమె ప్రేమ, కరుణ, త్యాగం, సహనం, ధైర్యం వంటి అనేక గొప్ప లక్షణాల సమాహారం. కుటుంబాన్ని నిర్మించడంలో, సమాజాన్ని ముందుకు నడిపించడంలో మహిళల పాత్ర ఎంతో ముఖ్యమైనది. అయినప్పటికీ చాలాసార్లు సమాజం ఆమె విలువను పూర్తిగా గుర్తించకపోవడం బాధాకరం. అందుకే "మగువా లోకానికి తెలుసా నీ విలువ" అనే ప్రశ్న ఎంతో అర్థవంతంగా ఉంటుంది.

ప్రతి మనిషి జీవితంలో మొదటి గురువు తల్లి. తల్లి మనకు ప్రేమను, మంచితనాన్ని, నీతిని నేర్పిస్తుంది. చిన్నప్పటి నుంచే పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దే బాధ్యతను తల్లి తీసుకుంటుంది. తల్లి కష్టపడుతూ కుటుంబాన్ని ప్రేమతో నడిపిస్తుంది. ఆమె తన సొంత అవసరాలను పక్కన పెట్టి కుటుంబ సభ్యుల సంతోషం కోసం శ్రమిస్తుంది. అందుకే తల్లి స్థానం ప్రపంచంలో అత్యంత గొప్పది. మహిళలు కేవలం కుటుంబ బాధ్యతలు మాత్రమే కాదు, సమాజంలోని అన్ని రంగాల్లో కూడా గొప్ప విజయాలు సాధిస్తున్నారు. విద్య, వైద్యం, విజ్ఞానం, రాజకీయాలు, క్రీడలు, సాహిత్యం వంటి అనేక రంగాల్లో మహిళలు తమ ప్రతిభను చూపిస్తున్నారు. గతంలో మహిళలకు అవకాశాలు తక్కువగా ఉన్నప్పటికీ, తమ ధైర్యం మరియు పట్టుదలతో వారు ఎన్నో అడ్డంకులను దాటుకొని విజయాలను సాధించారు. ఈ విజయాలు మహిళల సామర్థ్యాన్ని ప్రపంచానికి తెలియజేశాయి.

మహిళలు కుటుంబానికి ఆధారం మాత్రమే కాదు, సమాజానికి మార్గదర్శకులు కూడా. ఒక మంచి తల్లి, ఒక మంచి గురువు, ఒక మంచి నాయకురాలు సమాజాన్ని సత్పథంలో నడిపించగలదు. మహిళలు విద్యావంతులు అయితే కుటుంబం మొత్తం అభివృద్ధి చెందుతుంది. ఒక మహిళ ఎదిగితే కుటుంబం ఎదుగుతుంది; కుటుంబం ఎదిగితే సమాజం అభివృద్ధి చెందుతుంది. అందుకే మహిళల విద్య మరియు అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలి.

అయితే ఇంకా కొన్ని చోట్ల మహిళలు వివక్షను ఎదుర్కొంటున్నారు. కొన్నిసార్లు వారికి సమాన హక్కులు ఇవ్వరు. బాల్య వివాహాలు, అక్షరాస్యత లోపం, సామాజిక పరిమితులు వంటి సమస్యలు ఇంకా ఉన్నాయి. ఈ సమస్యలను తొలగించడం సమాజం యొక్క బాధ్యత. మహిళలకు సమాన అవకాశాలు, గౌరవం, భద్రత కల్పించాలి. అప్పుడు మాత్రమే వారు తమ ప్రతిభను పూర్తిగా చూపగలుగుతారు. ప్రభుత్వాలు కూడా మహిళల అభివృద్ధి కోసం అనేక పథకాలను అమలు చేస్తున్నాయి. మహిళల విద్య, ఉపాధి, ఆరోగ్యం కోసం వివిధ కార్యక్రమాలు చేపడుతున్నారు. అయితే సమాజంలోని ప్రతి ఒక్కరూ మహిళలను గౌరవించాలి. కుటుంబంలోనూ, బయట కూడా వారికి సమాన స్థానం ఇవ్వాలి. మహిళలపై గౌరవం పెరిగితే సమాజం మరింత శాంతియుతంగా మరియు అభివృద్ధి చెందినదిగా మారుతుంది.

మొత్తానికి, మగువ అనేది అమూల్యమైన రత్నం లాంటిది. ఆమె లేకుండా కుటుంబం అసంపూర్ణం, సమాజం అసంపూర్ణం. ఆమె ప్రేమ, త్యాగం, సేవలను మనం ఎప్పటికీ మరచిపోలేం. అందుకే మహిళల విలువను గుర్తించి గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత. "మగువా లోకానికి తెలుసా నీ విలువ" అనే ప్రశ్నకు నిజమైన సమాధానం -- అవును, ప్రపంచం ఆమె విలువను గుర్తించాలి, గౌరవించాలి, మరియు ఆమెకు సమాన హక్కులు ఇవ్వాలి. మహిళల గౌరవం కాపాడినప్పుడు మాత్రమే సమాజం నిజమైన పురోగతిని సాధిస్తుంది....

**అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు**

అక్కి వంశీ గౌడ్
ఫోన్:7670883796

# మహిళా ప్రజా ప్రతినిధులకు సన్మానం.

**ఎలిగేడు, మార్చి 7(నీలగిరి ఎక్స్ ప్రెస్):** అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎలిగేడు మండలంలోని నారాయణపల్లి, నర్సాపూర్, రాములపల్లె గ్రామాలతో పాటు పలు గ్రామాల్లో మహిళ దినోత్సవ వేడుకలను ముందస్తుగా శనివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా నారాయణపల్లి సర్పంచ్ రంగు లత తో పాటు వార్డుసభ్యులు, అంగన్వాడి టీచర్లను, నర్సాపూర్లో మహిళ వార్డు సభ్యులతోపాటు అంగన్వాడి టీచర్లను శాలువాలతో సన్మానించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు రంగు లత-శ్రీనివాస్ గౌడ్, పల్లెర్ల వెంకటేష్ గౌడ్, సిద్ధి తిరుపతి యాదవ్ పలు గ్రామాల సర్పంచులు పంచాయతీ కార్యదర్శులు, అంగన్వాడి టీచర్లు వివోఏలు మహిళ తదితరులు పాల్గొన్నారు. సర్పంచులు, వార్డుసభ్యులను శనివారం ముందస్తుగా సన్మానించారు.


నారాయణపల్లి లో సర్పంచ్ రంగులత శ్రీనివాస్ గౌడ్ ను సన్మానిస్తున్న వార్డు సభ్యులు

# సూర్యాపేట ఏఎస్సీడీఓ కార్యాలయంలో ఘనంగా మహిళా దినోత్సవం

- పాల్గొన్న ఏ ఎస్ సి డి ఓ శ్రీమతి కే.లత...





**సూర్యాపేట, మార్చి 7(నీలగిరి ఎక్స్ ప్రెస్):** కుడకుడ లోని సూర్యాపేట ఏ ఎస్ సి డి ఓ కార్యాలయంలో మహిళా దినోత్సవాన్ని శనివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి టీజీ ఎస్సీడిడి ఎం ఎస్ ఏ ఉమెన్స్ వింగ్ స్టేట్ ప్రెసిడెంట్, సూర్యాపేట ఏ ఎస్ సి డి ఓ మరియు సూపరిండెంట్ శ్రీమతి కే.లతా మేడం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కేకును కట్ చేసి ఘనంగా మహిళా దినోత్సవంను నిర్వహించారు. అనంతరం షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ మినిస్టీరియల్ స్టాఫ్ అసోసియేషన్ ఉమెన్స్ వింగ్ స్టేట్ ప్రెసిడెంట్ శ్రీమతి కె.లత మాట్లాడుతూ కాలమాన పరిస్థితులకు అనుగుణంగా మహిళలకు ప్రాముఖ్యత లభిస్తున్నదని, ఇట్టి సదవకాశాన్ని మహిళలు ఉపయోగించుకోవాలని సూచించారు. సోషల్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ లో దాదాపు సగం మంది మహిళ ఉద్యోగినులే ఉండటం మహిళల ప్రాధాన్యతను తెలియజేస్తుందని సెలవిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సీడిఓ సూర్యాపేట పరిధిలో ఉన్న మహిళ వసతి గృహ సంక్షేమ అధికారులు ఇందిర నిర్మల, వాణి, మహబూబా, నీలమ్మ లకు ఘనంగా సత్కారం చేయటం జరిగింది. ఇంకా ఈ కార్యక్రమంలో వసతి గృహ సంక్షేమ అధికారులు ఉప్పలయ్య, నాగేందర్, భాస్కర్, ఉస్మాన్, ముత్యాలరావు, నాగరాజు, కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక




**ఆమనగల్లు, మార్చి 7(నీలగిరి ఎక్స్ ప్రెస్) :** అమనగల్లు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన -ప్రగతి ప్రణాళిక 99 రోజుల్లో భాగంగా 2 వ రోజు కళాశాల ప్రధానాచార్యులు ప్రొఫెసర్ శ్రీపాద శర్వాణి ఆధ్వర్యంలో నిర్వహించారు . రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా రెండో రోజు తరగతి గదుల పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. విద్యార్థులు ప్రతి ఒక్కరు కార్యక్రమంలో భాగస్వాములై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు ఈ కార్యక్రమంలో అధ్యాపకులైన రాజకుమార్, గోపాల్, శ్రీవాణి నవనీత ,రాజు మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక పై అధికారుల సమీక్ష సమావేశం



**వెల్దండ, మార్చి 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వెల్దండ మండల కార్యాలయంలో శనివారం ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంపై అధికారుల సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులు, టి.ఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లకు కార్యక్రమంలో చేపట్టవలసిన పనులపై అవగాహన కల్పించారు. ప్రతి గ్రామంలో సర్పంచులు, వార్డు సభ్యులు, గ్రామస్థాయి అన్ని శాఖల అధికారులు, యువత, మహిళలు ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని సూచించారు. పారిశుధ్యం, త్రాగునీరు, ఆరోగ్యం వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచనలు చేశారు. ఈ సమావేశంలో మండల ఎంపీడీవో కృష్ణయ్య, లక్ష్మణ్, ఎంపీఓ ఈశ్వర్, ఏపీఓ మోహన్‌లాల్, పర్యవేక్షకుడు దేవేందర్, ఈసి, టి.ఏలు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని బీజేపీ డిమాండ్

**అచ్చంపేట, మార్చి 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బీజేపీ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. పట్టణ అధ్యక్షుడు గుండు శ్రీనివాస్ మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే రాష్ట్రంలోని ప్రతి మహిళ



ఖాతాలో నెలకు రూ.2500 జమ చేస్తామని హామీ ఇచ్చిందని, అయితే ఇప్పటి వరకు ఆ హామీ అమలు కాలేదని విమర్శించారు. ఈ నేపథ్యంలో బీజేపీ అచ్చంపేట పట్టణ శాఖ ఆధ్వర్యంలో స్థానిక ఎంఆర్వోకు వినతిపత్రం సమర్పించారు. మహిళలకు ఇచ్చిన హామీని ఆలస్యం చేయకుండా వెంటనే అమలు చేసి, కాంగ్రెస్ పార్టీ తన మాట నిలబెట్టుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు బాలాజీ, జానకి, సౌమ్య, మహేశ్వరి, రవీందర్, చందు లాల్, శివ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

# పదవ తరగతి విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు





**నల్గొండ, మార్చి 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తిప్పర్తి మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ అండ్ జూనియర్ కళాశాలలో శనివారం పదవ తరగతి విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఏ. అపర్ణ మాట్లాడుతూ, "చదువు అంటే కేవలం మార్కులు సాధించడం కాదు, మంచి వ్యక్తిగా ఎదగడం. మీరు ఇక్కడ నేర్చుకున్న పాఠాలు, క్రమశిక్షణ, విలువలు జీవితాంతం మీకు తోడుగా నిలుస్తాయి. మీరు ఎంచుకున్న రంగాలలో రాణించి, గొప్ప ప్రయోజకులు కావాలి. ఎంత ఎత్తుకు ఎదిగినా వినయాన్ని మర్చిపోకండి. ఓటములను చూసి అధైర్యపడకండి, అవి విజయానికి తొలిమెట్లు" అని విద్యార్థులను ఉద్దేశించి అన్నారు. విద్యార్థులు పాఠశాలలో గడిపిన మధురస్మృతులను గుర్తుచేసుకుని భావోద్వేగానికి గురయ్యారు. విద్యార్థులే నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



**తెలకపల్లి, మార్చి 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా శనివారం జిల్లా కలెక్టర్ తెలకపల్లి మండలాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా పిహెచ్‌సి తెలకపల్లి పరిసరాలను పరిశీలించి, హాస్పిటల్‌ను మరింత పరిశుభ్రంగా ఉంచాలని వైద్యులకు ఆదేశించారు. అనంతరం జడ్‌పిహెచ్‌ఎస్ తెలకపల్లి పాఠశాలను సందర్శించి, ఇప్పటివరకు చేసిన పనులను పరిశీలించారు. ఇంకా మెరుగ్గా చేయాలని తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ విజయ్‌కుమార్, ఎంపీఓ వెంకటయ్య, ప్రధానోపాధ్యాయుడు శోభన్‌బాబు, వైద్యులు, సూపరింటెండెంట్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# డా. నోముల వెంకటేశ్వర్లుకు తెలంగాణ బెస్ట్ సైకాలజిస్టు అవార్డు



**హైదరాబాద్, మార్చి 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
సికింద్రాబాద్ హరిహర కళాభవన్‌లో మార్చి 8న జరగనున్న 38వ సేవా ఉగాది మహోత్సవంలో హయత్‌నగర్ గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ అసోసియేట్ ప్రొఫెసర్ డా. నోముల వెంకటేశ్వర్లు "తెలంగాణ బెస్ట్ సైకాలజిస్టు అవార్డు--2026" అందుకోనున్నారు. ఈ అవార్డును కేంద్ర మంత్రి రాందాస్ అథవాలే ప్రదానం చేయగా, హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ ముఖ్య అతిథిగా హాజరవుతారు. వరుసగా రెండోసారి ఈ గౌరవం లభించడం విశేషం. మానసిక ఆరోగ్య అవగాహన, ఉచిత కౌన్సెలింగ్ సేవలు, సమాజంలో చైతన్యం కల్పించడంలో ఆయన చేసిన విశిష్ట సేవలకు గుర్తింపుగా ఈ అవార్డు లభించింది.

# ధర లేక ఆందోళనలో టమాట రైతు

- పంటను చేనులోనే వదిలేస్తున్న రైతులు





**కడ్తాల్, మార్చి 7 ( నీలగిరి ఎక్స్ ప్రేస్ ) :**
టమోటా ధరలు పడిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. సాధారణ పద్ధతిలో పంట సాగు చేస్తే ఎకరానికి రూ.50వేల వరకు ఖర్చు అవుతోంది. మల్చింగ్ షీట్, కట్టెలపై సాగు చేస్తే మరో రూ.50వేలు అదనపు ఖర్చు అవుతుంది. పంట కోత కొచ్చిన తరువాత కూలీల ఖర్చులు, మార్కెట్‌కు కాయల తరలింపు రవాణా, వాహనాల బాడుగ, ఇతరత్ర అన్నీ కలుపుకుని తడిసిమోపేడవుతున్నాయి. అన్నీ కష్టాలను భరించి మార్కెట్‌కు కాయలు తీసుకెళ్లితే ఒక పెట్టె(బాక్స్ )100నుంచి 200ధర వస్తుందని పెట్టిన పెట్టుబడులు, కూలీలకు కూడా సరిపోవడం లేదని అన్నదాతలు ఆందోళన చెందుతున్న పరిస్థితి. మార్కెట్‌లో టమోటాకు ధర లేకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. పంట చేతి కొచ్చే సమయానికి ధరలు లేకుండా పోయాయంటూ వాపోతున్నారు. ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలంటూ కోరుతున్నారు. రవాణా ఖర్చులు కూడా గిట్టవని పలువురు రైతులు టమోటాలను పొలంలోనే వదిలేస్తున్నారు. ధర లేక రంగారెడ్డి జిల్లా కడ్తాల్ శివారులోని హైదరాబాద్ - శ్రీశైలం జాతీయ రహదారి పక్కన టమోటాలను పారాబోషారు రైతులు.

# ప్రజాపాలన--ప్రగతి ప్రణాళికలో నల్గొండ జిల్లా రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలవాలి



**నల్గొండ, మార్చి 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నల్గొండ జిల్లా కేంద్రంలోని ఉదయాదిత్య భవనంలో శనివారం ప్రజాపాలన--ప్రగతి ప్రణాళికపై ఉమ్మడి నల్గొండ జిల్లా సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర ఎస్సీ--ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరు లక్ష్మణ్‌కుమార్, రాష్ట్ర రోడ్లు--భవనాలు--సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ, "ప్రజాపాలన--ప్రగతి ప్రణాళికలో నల్గొండ జిల్లా రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలవాలి. గ్రామాల్లో సమస్యలను తెలుసుకుని పరిష్కరించడమే కాకుండా, అర్హులైన లబ్ధిదారులకు పథకాలు అందించాలి" అని సూచించారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ, "ప్రజాపాలన కార్యక్రమంలో ముఖ్యమైన పది అంశాల వారీగా చర్యలు జరుగుతున్నాయి. పరిశుభ్రత, పెండింగ్ ఫైళ్ల పరిష్కారం, రైతుల సమస్యలు, మహిళలు--పిల్లల భద్రత, రోడ్డు ప్రమాదాల నివారణ వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి. ఇందిరమ్మ ఇండ్ల బిల్లులు సోమవారం లోపు క్లియర్ చేస్తాం. ఏప్రిల్ నుండి మరో విడత ఇళ్లు ఇస్తాం. సాగునీటి కోసం డిండి ఎత్తిపోతల పథకం, మూసి ప్రక్షాళన, సోలార్ విద్యుత్ వినియోగం వంటి చర్యలు చేపడతాం" అని వివరించారు. మంత్రి అడ్లూరు లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ, "ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు -- రేషన్ కార్డులు, సన్న బియ్యం, ఉచిత విద్యుత్తు, రైతుబంధు, రైతు బీమా, రైతు భరోసా -- అన్నీ పేద ప్రజలకు చేరాలి. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలి. నిర్లక్ష్యం వహించరాదు. ప్రత్యేకంగా వాట్సాప్ ద్వారా కూడా కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తాం" అని తెలిపారు. రాష్ట్ర శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ, "గ్రామపంచాయతీలకు ఇచ్చిన ట్రాక్టర్లను సద్వినియోగం చేయాలి. వేసవిలో తాగునీటి సమస్య రాకుండా కలెక్టర్లు, ఆర్డబ్ల్యూఎస్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. విద్యుత్ కొరత నివారణకు సోలార్ విద్యుత్ వినియోగం పెంచాలి" అని సూచించారు. ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య మాట్లాడుతూ, "ప్రజాప్రతినిధులు--అధికారుల సమన్వయంతోనే ప్రజాపాలన కార్యక్రమం విజయవంతమవుతుంది. గ్రామాల్లో వోల్టేజ్ సమస్య, తాగునీటి సమస్యలు రాకుండా చూడాలి. ఇందిరమ్మ ఇళ్ల సమస్యలు పరిష్కరించాలి. మిషన్ భగీరథ కింద తాగునీటి సమస్య లేకుండా ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలి" అని అన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీలు నెల్లికంట సత్యం, శంకర్ నాయక్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, నల్గొండ మేయర్ చైతన్య బుర్రి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ మాట్లాడుతూ, "మార్చి 6 నుండి జూన్ 12 వరకు 99 రోజులపాటు ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక అమలు జరుగుతుంది. గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలలో కార్యక్రమాలు ఉంటాయి. పది ప్రధాన అంశాలపై చర్యలు చేపడతాం" అని పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్, యాదాద్రి--భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, నల్గొండ ఎస్పి శరత్‌చంద్ర పవార్, నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి, అదనపు కలెక్టర్లు, అధికారులు పాల్గొన్నారు.

# ఆమనగల్లు లయన్స్ క్లబ్‌కు అవార్డుల పంట



**ఆమనగల్లు, మార్చి 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
లయన్స్ క్లబ్ జిల్లా 320 రీజియన్--1 వైలెట్ రీజియన్ సమావేశం గోవా పనాజీ లోని రేజింత్ బై వాచ్ రిసార్ట్‌లో జరిగింది. ఈ సమావేశంలో లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు అవార్డుల పంటను సొంతం చేసుకుంది. రీజియన్ చైర్‌పర్సన్ లయన్ సంపతి జనార్దన్‌రెడ్డి చేతుల మీదుగా ఆమనగల్లు లయన్స్ క్లబ్‌కు 12 అవార్డులు లభించాయి. అత్యుత్తమ క్లబ్‌గా ఆమనగల్లు లయన్స్ క్లబ్ ఎంపికైంది. ఉత్తమ అధ్యక్షుడిగా లయన్ కే. గోవర్ధన్‌రెడ్డి, ఉత్తమ కార్యదర్శిగా గంప శ్రీనివాస్ గుప్తా, ఉత్తమ కోశాధికారిగా శ్రీనివాస్‌రెడ్డి, అత్యుత్తమ పీఆర్వోగా ఎం.ఏ. పాషా అవార్డులు అందుకున్నారు. ల్యాబ్ టెక్నీషియన్ లయన్ సంపత్‌కుమార్, సమన్వయకర్త వీరబ్రహ్మ బిక్షపతి, పర్మినెంట్ ప్రాజెక్టులు, మీల్స్ అండ్ వీల్స్, కంటి వైద్య శిబిరాలు, మెగా వైద్య శిబిరాలు, ఉత్తమ ఉపాధ్యాయుల సన్మానం, గుండె సంబంధిత వైద్య పరీక్షలు నిర్వహించినందుకు ప్రత్యేక అవార్డులు లభించాయి. 2025--2026 సంవత్సరానికి గాను సేవలు అందించినందుకు రీజియన్‌లో అవార్డులకు ఎంపికైన సభ్యులను క్లబ్ అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి అభినందించారు. క్లబ్ చేపట్టే సేవా కార్యక్రమాలకు సహకరించిన ప్రతి ఒక్క లయన్ సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్లు, మల్టిపుల్ ఏరియా లీడర్ సందడి నరేందర్‌రెడ్డి, మాజీ గవర్నర్ జి. చెన్నకిషన్‌రెడ్డి, రామ్‌రెడ్డి కంటి ఆసుపత్రి చైర్మన్, డాక్టర్ వి. దామోదర్‌రెడ్డి, రీజియన్ కార్యదర్శి పి. వెంకట్‌రెడ్డి, చార్టర్ నైట్ చైర్మన్ కండె ఓంకారం, జిల్లా చైర్మన్లు యెన్నం హరికాంత్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, చంద్రశేఖర్, వెంకటేష్, అర్థం మనోహర్, డాక్టర్ వెంకట్‌రెడ్డి, విష్ణువాస్‌రెడ్డి, లయన్ గీతా నరేందర్‌రెడ్డి, లయన్ చెన్నకిషన్‌రెడ్డి, పారిజాత, సమన్వయకర్త వీరబ్రహ్మ బిక్షపతి, లయన్ సభ్యులు సంపత్‌కుమార్, పిప్పల్ల వెంకటేష్, దూదే రాజేందర్, చేగురి వెంకటేష్, వెంకటస్వామి, గుజ్జరి నరసింహ, కటిక శ్రీనివాస్‌రెడ్డి, నరసింహారెడ్డి, యాదయ్య, క్లబ్ పీఆర్వో పాషా తదితరులు పాల్గొన్నారు.

# ఈనెల 23న ఎస్సీ కార్పొరేషన్ ముందు ధర్నాను జయప్రదం చేయాలి

### కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు నాగార్జున




**నల్గొండ, మార్చి 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** గత పది సంవత్సరాలుగా దళితుల అభివృద్ధి పూర్తిగా శూన్యమైందని, ప్రభుత్వాలు మారినా దళితులకు సంబంధించిన సంక్షేమ పథకాలు అమలు కాలేదని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు నాగార్జున విమర్శించారు. ఈనెల 23న నల్గొండ జిల్లా ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయం ముందు భారీ ఎత్తున దళితులతో ధర్నా నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. నల్లగొండ జిల్లా కమిటీ సమావేశం స్థానిక దొడ్డి కొమరయ్య భవనంలో జిల్లా అధ్యక్షులు కొండేటి శ్రీను అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ, “దళిత బంధు పేరుతో గత ప్రభుత్వం బడ్జెట్ కేటాయించినట్లు చూపించి అమలు చేయలేదు. వేలాది కుటుంబాలకు అన్యాయం జరిగింది. ప్రస్తుత ప్రభుత్వం కూడా ఇప్పటివరకు ఎలాంటి కేటాయింపులు చేయలేదు. ఎస్సీ--ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు కాగితాలకే పరిమితమయ్యాయి” అని అన్నారు. దళితులకు భూమి, ఇండ్లు, స్థలాలు, మంచినీరు, మురికికాలువలు, రోడ్లు వంటి మౌలిక సదుపాయాలు ఇప్పటికీ అందకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. కెవిపిఎస్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 14న అంబేద్కర్ జయంతి సందర్భంగా కులరహిత సమాజ నిర్మాణం కోసం పెద్ద ఎత్తున సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే పూలే--అంబేద్కర్ జనజాతరలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. జిల్లా వ్యాప్తంగా గ్రామాలలో సర్వేలు నిర్వహించి ఉద్యమాలు, పోరాటాలు చేపడతామని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు కొండేటి శ్రీను, ఉపాధ్యక్షులు రెమిడాల పరిశరాములు, సహాయ కార్యదర్శులు గాదె నరసింహ, బొల్లు రవీందర్, పెరికే విజయ్‌కుమార్, ఒంటెపాక కృష్ణ, కోడిరెక్క మల్లన్న, కమిటీ సభ్యులు దండు రవి, చిలుముల రామస్వామి, రాజశేఖర్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## ఎలిగేడు మండలంలో ప్రజాపాలన --ప్రగతి ప్రణాళికపై గ్రామసభలు



నారాయణపల్లి లో సర్పంచ్ రంగు లతా శ్రీనివాస్ గౌడ్ అధ్యక్షతన గ్రామ సభ.




**ఎలిగేడు, మార్చి 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఎలిగేడు మండలంలోని నారాయణపల్లి, నర్సాపూర్ గ్రామాల్లో ప్రజాపాలన--ప్రగతి ప్రణాళికపై గ్రామసభలు నిర్వహించారు. సర్పంచులు రంగులత--శ్రీనివాస్ గౌడ్, పల్లె వెంకటేశ్ గౌడ్ ఆధ్వర్యంలో గ్రామాభివృద్ధి ప్రణాళికలపై చర్చించి పలు తీర్మాణాలు చేశారు. మండలంలోని అన్ని గ్రామాల్లో కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించారు. ఎంపీడీవో బాస్కరావు, ఎంపీవో కిరణ్ పర్యటించి పనులను పర్యవేక్షించారు. ఈ సమావేశంలో సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు, అంగన్వాడీ టీచర్లు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## పీఎం సంసద్ ఖేల్ మహోత్సవ్ క్రీడాకారుల ప్రతిభకు వేదిక



**కరీంనగర్, మార్చి 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** ఖేలో ఇండియాలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడు, కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో పీఎం సంసద్ ఖేల్ మహోత్సవ్ కార్యక్రమం ప్రారంభమైంది. కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలో పార్లమెంట్ స్థాయి క్రీడా పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని అసెంబ్లీ కేంద్రాల్లో జరిగిన పోటీల్లో విజేతలుగా నిలిచిన జట్లకు ఈ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా బీజేపీ జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి, రెడ్డబోయిన గోపి, నగరపాలక సంస్థ మేయర్, డిప్యూటీ మేయర్ కోలగని శ్రీనివాస్, సునీల్ రావు, కార్పొరేటర్లు పాల్గొన్నారు. ముఖ్య అతిథులు మాట్లాడుతూ, క్రీడలు ఆరోగ్యవంతమైన జీవనశైలిలో భాగమని, శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక సమస్యలను దూరం చేస్తాయని పేర్కొన్నారు. క్రీడలు క్రమశిక్షణ, బృందస్ఫూర్తి, నాయకత్వ లక్షణాలు, వ్యూహరచన నైపుణ్యం, విమర్శనాత్మక ఆలోచన పెంపొందిస్తాయని అన్నారు. విద్య ఎంత అవసరమో క్రీడలు అంతే అవసరమని గుర్తు చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ క్రీడలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ప్రతి పార్లమెంట్ నియోజకవర్గంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నారని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభ కలిగిన క్రీడాకారులకు ఇది ఒక మంచి వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు. పార్లమెంట్ స్థాయిలో విజేతలుగా నిలిచే జట్లకు ఈనెల 8న బహుమతుల ప్రధానోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుగ్గిల్లపు రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకటరెడ్డి, కార్పొరేటర్లు బోయినపల్లి ప్రవీణ్ రావు, కేపీ చంద్ర, నాంపల్లి శ్రీనివాస్, తాటి ప్రభావతి, పెద్దపల్లి శ్రీలేఖ, ప్రోగ్రాం కోఆర్డినేటర్ గుజ్జ శ్రీనివాస్, ఎర్రం మహేష్, కరండ్ల మధుకర్, తణుకు సాయి కృష్ణ, శ్రవణ్, విమల్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళా దినోత్సవ వేడుకల్లో అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే



**కరీంనగర్, మార్చి 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ (లోకల్ బాడీస్) అశ్విని తానాజీ వాకడే ఐఏఎస్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మహిళల పాత్ర సమాజ అభివృద్ధిలో అత్యంత కీలకమని పేర్కొన్నారు. తాను ఈ స్థాయికి చేరుకోవడానికి తన తల్లి ఇచ్చిన ప్రేరణే కారణమని, అమ్మే నా మొదటి గురువు అని భావోద్వేగంతో తెలిపారు. నవోదయ పాఠశాలలో తన విద్యాభ్యాసం ప్రారంభమైందని, తల్లి ఇచ్చిన విలువలు, క్రమశిక్షణే జీవితంలో ఉన్నత స్థాయికి తీసుకువచ్చాయని అన్నారు. తల్లి చదువుకోకపోయినా తనను బలంగా చదివించి ఈ స్థాయికి తీసుకువచ్చిందని గుర్తుచేసి, భవిష్యత్తులో తల్లి చెప్పిన పాఠాలను గౌరవంగా పాటించే వారు తప్పకుండా ముందుకు సాగుతారని సూచించారు. అనంతరం మహిళా ఉద్యోగులకు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్, టీఎన్జీవోల జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, భారతీయ సంస్కృతిలో స్త్రీలకు ఉన్న స్థానం, వారు ఎదుర్కొన్న అన్యాయాలు, నేటి చట్టపరమైన రక్షణలు, మహిళల ప్రతిభ ప్రతి రంగంలో వెలుగొందుతున్న విధానాన్ని వివరించారు. స్త్రీలను పుట్టనిద్దాం బ్రతకనిద్దాం వారికి బంగారు భవిష్యత్తు ఇవ్వుదాం అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్వో డా. వెంకటరమణ, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ అధికారి సరస్వతి, సంఘ నాయకులు, వివిధ శాఖల అధ్యక్షులు, కార్యదర్శులు, దాదాపు 300 మంది మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

## శాతవాహన విశ్వవిద్యాలయంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం



**కరీంనగర్, మార్చి 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా శాతవాహన విశ్వవిద్యాలయం ఆవరణలో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పది రోజుల పరిశుభ్రత కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించబడింది. విశ్వవిద్యాలయ ఆర్ట్స్ మరియు న్యాయ కళాశాలలో రిజిస్ట్రార్ ఆచార్య పి. సతీష్ కుమార్ స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని ప్రారంభించి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, చెత్తను వేరువేయాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఆయనతో పాటు జాతీయ సేవా పథకం విద్యార్థులు ఆవరణను శుభ్రపరిచారు. సైన్స్ కళాశాలలో ప్రిన్సిపల్ రమాకాంత్ అధ్యక్షతన స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించి పిచ్చి మొక్కలను తొలగించారు. కామర్స్ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ డి. హరి కాంత్ అధ్యక్షతన, జాతీయ సేవా పథకం అధికారి డాక్టర్ తిరుపతి ఆధ్వర్యంలో శ్రమదానం చేశారు. మానేరు డ్యాం సమీపంలోని ఫార్మసీ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీశైలం అధ్యక్షతన ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. ఆర్ట్స్ కళాశాల, న్యాయ కళాశాల ప్రిన్సిపల్ పద్మావతి మాట్లాడుతూ, స్వచ్ఛతను విద్యార్థులు తమ జీవితంలో భాగంగా చేసుకోవాలని, పరిశుభ్రతను బాధ్యతగా భావించి మంచి పర్యావరణాన్ని ఏర్పరచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్స్ కాలేజ్ వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ మహమ్మద్ అబ్రరుల్ భాఖి, జాతీయ సేవా పథకం అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు, వాలంటీర్లు పాల్గొని విశ్వవిద్యాలయ ఆవరణను శుభ్రం చేశారు.

## విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రణాళికాబద్ధమైన చదువు అవసరం



**గంగాధర, మార్చి 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలంలోని నరేంద్ర విద్యాలయం హై స్కూల్ ఆవరణలో పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ రాజేశం, యాజమాన్య సభ్యుడు గుజ్జల గోపాల్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత చదువులు అభ్యసించి ఉన్నత స్థాయిలో ఎదగాలని ఆకాంక్షించారు. ప్రణాళికాబద్ధంగా, క్రమశిక్షణతో, పట్టుదలతో చదివితే విజయం సాధించడం సాధ్యమని వారు సూచించారు. విద్యార్థులు తల్లిదండ్రుల పట్ల, పెద్దల పట్ల గౌరవంగా ఉండాలని, చదువుతో పాటు సంస్కారం నేర్చుకోవాలని అన్నారు. వీడ్కోలు కార్యక్రమంలో విద్యార్థులు ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు. నృత్య ప్రదర్శనలతో తల్లిదండ్రులను ఆకట్టుకున్నారు. ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ కార్యక్రమంలో పాల్గొని విద్యార్థుల భవిష్యత్తు విజయానికి శుభాకాంక్షలు తెలిపారు.

## బొమ్మకల్‌లో డ్రైనేజీ పనులకు శంకుస్థాపన



**కరీంనగర్ రూరల్, మార్చి 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా బొమ్మకల్ 6వ డివిజన్ గుంటూరుపల్లిలో హనుమాన్ దేవాలయం వద్ద డ్రైనేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్ హాజరై పనులను ప్రారంభించారు. 5 లక్షల జనరల్ ఫండ్ నిధులతో చేపట్టిన ఈ అభివృద్ధి కార్యక్రమానికి మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, 6వ డివిజన్ కార్పొరేటర్ మ్యకల వెంకటేష్ సమన్వయం వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ పట్టణ అభివృద్ధి కోసం ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రతి డివిజన్‌లో అవసరమైన పనులను చేపడుతున్నామని తెలిపారు. ప్రజల సహకారంతో ఈ కార్యక్రమాలు విజయవంతం అవుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రైల్వే బోర్డు సభ్యులు పాశం తిరుపతి, సాయవేణి సదానందం, పుట్టపాక శ్రీధర్, దాది సుధాకర్, కాల్వ రామచంద్రం, గాలిపెల్లి నారాయణ, పెద్ది లక్ష్మణ్, డివిజన్ నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## కరెంట్ కోతలను నిరసిస్తూ సబ్‌స్టేషన్ ముందు ధర్నా



**గన్నేరువరం, మార్చి 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్** :రెండు రోజులుగా గ్రామంలో కరెంట్ లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గునుకుల కొండాపూర్ సర్పంచ్ అజయ్ వర్మ, చీమలకుంటపల్లి సర్పంచ్ జంగిడి ప్రకాష్ నేతృత్వంలో గ్రామస్తులు సబ్‌స్టేషన్ ముందు ధర్నా చేపట్టారు. గ్రామంలో తాగునీరు, పశువులకు నీరు, పొలాలకు నీరు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు తెలిపారు. ఎండలు ఎక్కువగా ఉండటంతో మహిళలు, చిన్నపిల్లలు ఇళ్లలో ఉండలేని పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. గుండ్లపల్లి నుండి గునుకుల కొండాపూర్ వరకు ఎక్స్‌ప్రెస్ లైన్ ఇవ్వాలని, రైతులకు 24 గంటల త్రీఫేస్, సింగిల్‌ఫేస్ కరెంట్ అందించాలని డిమాండ్ చేశారు. వెంటనే చర్యలు తీసుకోకపోతే గ్రామ ప్రజలంతా కలిసి సబ్‌స్టేషన్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చుక్కల లక్ష్మయ్య, చోక్కల మల్లేశం, గుడెల్లి మల్లేశం, బూట్ల సంపత్, దోమటి రాజేందర్, కొంకటి గణేష్, తాళ్లపల్లి రాజయ్య, మధు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా హెచ్‌పివి వ్యాక్సిన్ పోస్టర్ ఆవిష్కరణ



**కరీంనగర్, మార్చి 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ, అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే కలిసి హెచ్‌పివి వ్యాక్సిన్ పోస్టర్‌ను ఆవిష్కరించారు.14--15 సంవత్సరాల వయసు గల ఆడపిల్లలకు గర్భాశయముఖ ద్వార క్యాన్సర్ నివారణ కోసం హెచ్‌పివి వ్యాక్సిన్ ఈనెల 8న ప్రారంభమవుతుందని అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ సాజిదా, డిప్యూటీ డీఎంహెచ్వో డాక్టర్ రాజగోపాల్, పిఓఎంహెచ్‌ఎన్ డాక్టర్ సనా జవేరియా, హెల్త్ ఎడ్యుకేటర్ సరస్వతి పాల్గొన్నారు.

# ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికలో ఉచిత ఆరోగ్య శిబిరాలు



**కరీంనగర్, మార్చి 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా మార్చి 6 నుండి జూన్ 12 వరకు ఉచిత ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తున్నారు.జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ, పిఓఎంహెచ్‌ఎన్ డాక్టర్ సనా జవేరియా, డిపిఎం స్వామితో కలిసి హౌసింగ్ బోర్డ్, కట్ట రాంపూర్, విద్యానగర్ అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించి ప్రజా ఆరోగ్య సేవలను సమీక్షించారు.ఈ సందర్భంగా ప్రజలు తమ ఆరోగ్య పరిస్థితులను పరీక్షించుకోవాలని, ఉచితంగా మందులు పొందాలని, గర్భిణీ స్త్రీలు పిహెచ్‌సీలో అందుతున్న వైద్య సేవలను వినియోగించుకోవాలని సూచించారు.శిబిరాల్లో మాతా--శిశు సంరక్షణ, కౌమారదశ బాలికల ఆరోగ్య సేవలు, వృద్ధుల ఆరోగ్య పరీక్షలు, రక్తహీనత నిర్ధారణ, 30 ఏళ్లు పైబడిన వారికి బీపీ, షుగర్, దీర్ఘకాలిక వ్యాధుల పరీక్షలు నిర్వహిస్తున్నారు. క్షయ, ఎయిడ్స్ వంటి వ్యాధులకు నిర్ధారణ పరీక్షలు చేసి అవసరమైన మందులు ఉచితంగా అందిస్తున్నారు.ఈ కార్యక్రమంలో అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు డాక్టర్ ప్రణవ్, డాక్టర్ నవ్య, డాక్టర్ రాజ్‌కుమార్ మరియు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శుభ్రతా కార్యక్రమం




**కరీంనగర్, మార్చి 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా కరీంనగర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (స్వయంప్రతిపత్తి)లో ప్రత్యేక శుభ్రతా డ్రైవ్ నిర్వహించారు.కళాశాల విభాగాలు, ప్రయోగశాలలు, తరగతి గదులు, లైబ్రరీ, పరికరాలను పూర్తిగా శుభ్రం చేశారు. విద్యార్థులు, అధ్యాపకులు ఉత్సాహంగా పాల్గొన్నారు.సంస్థాగత అమలు కమిటీ సమన్వయకర్త పి. స్వరూప మాట్లాడుతూ ఇది కార్యక్రమం రెండవ రోజు అని, రాబోయే 10 రోజుల్లో ఇలాంటి కార్యక్రమాలు కొనసాగుతాయని తెలిపారు.కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డి. వరలక్ష్మి అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించబడింది.

# మహిళలే దేశానికి వెన్నెముక





ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు














**కరీంనగర్/హుస్నాబాద్, మార్చి 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కరీంనగర్, హుస్నాబాద్ ప్రాంతాల్లో వివిధ సంస్థలు, కళాశాలలు, సంఘాలు ఘనంగా వేడుకలు నిర్వహించాయి.హుస్నాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళా అధ్యాపకులు, సిబ్బందిని సన్మానించారు. ప్రిన్సిపల్ విజయగిరి బిక్షపతి మాట్లాడుతూ స్త్రీలు అన్ని రంగాల్లో ముందుంటేనే దేశం అభివృద్ధి సాధిస్తుందని అన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి మహిళా విద్య ప్రాముఖ్యతను వివరించి, రిజర్వేషన్ వల్ల తాను ప్రజాసేవలోకి వచ్చినట్లు గుర్తుచేశారు.హుస్నాబాద్ పురపాలక సంఘ కార్యాలయంలో మహిళా కౌన్సిలర్లకు, పారిశుధ్య కార్మికులకు సన్మానం చేసి, ఆటలు, పాటలతో వేడుకలు ఉత్సాహంగా సాగాయి.కరీంనగర్‌లోని శ్రీ వేదం ఉన్నత పాఠశాలలో విద్యార్థినులు భారతదేశంలో విశేష కృషి చేసిన మహిళా మణులను గుర్తు చేస్తూ నృత్య ప్రదర్శనలు చేశారు. కరస్పాండెంట్ బొమ్మ శ్రీనివాస్ గౌడ్ మహిళా అధ్యాపకులను సత్కరించారు.అపూర్వ ఉమెన్స్ డిగ్రీ కాలేజీలో జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ చైతన్య సదస్సు జరిగింది. మహిళలకు చట్టబలం అవసరమని, వేధింపులను భరించడం నేరాన్ని ప్రోత్సహించడమేనని న్యాయవాదులు పేర్కొన్నారు. విద్యార్థినులు మహిళా చైతన్య ప్రతిజ్ఞ చేశారు.లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ గోల్డెన్ టవర్ ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలను సత్కరించారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేసి ఉద్యోగాలు, వ్యాపారాల ద్వారా ఆర్థిక సాధికారత సాధించాలని సూచించారు. అడిషనల్ కలెక్టర్ లక్ష్మీ కిరణ్ లింగ వివక్ష లేని సమాజమే అసలైన అభివృద్ధి అని అన్నారు.ముకుంద లాల్ మిశ్ర భవన్లో సీఐటీయూ ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో మారెళ్ళ శ్రీలత మాట్లాడుతూ మహిళా వివక్ష ఇంకా కొనసాగుతుందని, సంఘటిత పోరాటాలతోనే సమాన హక్కులు, వేతనాలు సాధ్యమని అన్నారు.జిల్లా వ్యాప్తంగా జరిగిన ఈ వేడుకల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొని, సమాజంలో తమ పాత్రను మరింత బలంగా చాటుకున్నారు.

# భగత్ సింగ్ స్ఫూర్తితో మాదకద్రవ్యాల వ్యతిరేక ఉద్యమం




**కరీంనగర్, మార్చి 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
షహీద్ భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్‌ల 95వ వర్ధంతి సందర్భంగా అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) కరీంనగర్ జిల్లా సమితి ఆధ్వర్యంలో గీతా భవన్ చౌరస్తాలో వాల్ పోస్టర్స్ విడుదల చేశారు.ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి భామండ్లపల్లి యుగంధర్ మాట్లాడుతూ, భగత్ సింగ్ కలలుగన్న స్వరాజ్యానికి అనుగుణంగా నేటి యువత చెడు అలవాట్లు, మాదకద్రవ్యాలను విడనాడాలని పిలుపునిచ్చారు. కుల, మతాలకు అతీతంగా అవినీతి రహిత సమసమాజం స్థాపన కోసం ఆయన చూపిన మార్గం నేటికీ స్ఫూర్తిదాయకమని అన్నారు.మతోన్మాద రాజకీయాలను సమూలంగా ఓడించడం భగత్ సింగ్‌కు నిజమైన నివాళి అవుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు చంచాల మురళి, పెనుమల్ల భాస్కర్, అవినాష్, రాజేష్, ఎండి రెహాన్, ఎస్. అరవింద్, కే. సాగర్, ఎస్. మనోజ్, ఎస్. శివరాం, గౌతమ్, అనిల్, సాయి ప్రణీత్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికపై ఏఐఎఫ్‌బి విమర్శలు




**కరీంనగర్, మార్చి 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల యాక్షన్ ప్లాన్ కొత్త డ్రామా మాత్రమేనని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర కన్వీనర్ అంబటి జోజి రెడ్డి విమర్శించారు.కరీంనగర్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈ ప్రణాళికలో స్పష్టమైన కార్యాచరణ కనిపించడం లేదని, ప్రజలకు ఏ ప్రయోజనం కలుగుతుందో ప్రభుత్వం వివరించాలని డిమాండ్ చేశారు. 99 రోజుల వ్యవధి ఏ ప్రాతిపదికన నిర్ణయించబడిందో, ఎంత బడ్జెట్ కేటాయించబడిందో ప్రజలకు తెలియజేయాలని కోరారు.రైతులు నీటి సమస్యలతో ఇబ్బందులు పడుతుండగా, యువతకు ఉపాధి అవకాశాలు తక్కువగా ఉన్నాయని, పేద--మధ్యతరగతి ప్రజలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీలను తక్షణమే అమలు చేయాలని, రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రజా పాలన పేరుతో కార్యక్రమాలు నిర్వహించడం కాకుండా, ప్రజల సంక్షేమం కోసం పారదర్శకంగా అమలు అయ్యే చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడతామని అంబటి జోజి రెడ్డి హెచ్చరించారు.

# కాంగ్రెస్ హామీల అమలు కోరుతూ బీజేపీ నిరసన

**సిరిసిల్ల , మార్చి 7(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
భారతీయ జనతా పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో గంభీరావుపేట మండలంలో నిరసన కార్యక్రమం జరిగింది. మండల అధ్యక్షుడు కోడె రమేశ్ నేతృత్వంలో ఎమ్మార్వో కార్యాలయం ముందు బైఠాయించి, ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ వినతిపత్రం సమర్పించారు.బీజేపీ నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో రాష్ట్రంలోని మహిళల ఖాతాల్లో నెలకు రూ.2500 జమ చేస్తామని హామీ ఇచ్చిందని, కానీ ఇప్పటి వరకు ఆ హామీ అమలు కాలేదని




విమర్శించారు. మహిళలకు ఇచ్చిన హామీని ఆలస్యం చేయకుండా వెంటనే అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ కార్యక్రమంలో మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు సెల్ వాజిద్ హుస్సేన్, మండల ప్రధాన కార్యదర్శి మలేష్ యాదవ్, సర్పంచ్ పొన్నాల మహేష్, ఉపాధ్యక్షులు నర్సింలు, మోహన్, కార్యదర్శి స్వామి, కృష్ణకాంత్ యాదవ్, డాక్టర్ సత్యనారాయణ, బండ దేవయ్య, లింగం అంజన్ రావు, శ్రీనివాస్, దేవేందర్ యాదవ్, ఎల్లం శ్రీనివాస్, నరేష్, తిరుపతి, పిట్ల రాజేష్, మహేష్, రాకేష్, నవీన్ తదితర నాయకులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ మహిళా దినోత్సవం

### మహిళల సాధికారతే సమాజ పురోగతి

ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం మార్చి 8న జరుపుకునే అంతర్జాతీయ మహిళా దినోత్సవం మహిళల గౌరవం, సమాన హక్కులు, భద్రత, సాధికారతను గుర్తు చేసే రోజు. కుటుంబం నుండి దేశ నిర్మాణం వరకు ప్రతి రంగంలో మహిళలు తమ ప్రతిభను నిరూపిస్తూ సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారు.మహిళా దినోత్సవం చరిత్రను పరిశీలిస్తే, గతంలో మహిళలకు విద్య, ఉద్యోగాలు, రాజకీయాల్లో అవకాశాలు చాలా తక్కువగా ఉండేవి. ఈ పరిస్థితులను మార్చడానికి మహిళలు సమాన హక్కుల కోసం పోరాటం చేశారు. ఆ ఉద్యమాల ప్రభావంతో 1975లో యునైటెడ్ నేషన్స్ అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని అధికారికంగా గుర్తించింది. అప్పటి నుండి ప్రతి సంవత్సరం ఈ రోజు ప్రపంచ దేశాలు ఘనంగా జరుపుకుంటున్నాయి. మహిళలు తల్లి, గురువు, వైద్యురాలు, శాస్త్రవేత్త, నాయకురాలు వంటి అనేక పాత్రల్లో సమాజానికి బలమైన స్థంభాలుగా నిలుస్తున్నారు. విద్య, వైద్యం, శాస్త్రసాంకేతికం, క్రీడలు, రాజకీయాలు, వ్యాపార రంగాల్లో వారు విశేష విజయాలు సాధిస్తున్నారు. భారతదేశంలో మహిళలు ప్రస్తుతం అన్ని రంగాల్లో ముందుకు వస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం బేటీ బచావో--బేటీ




పడావో, ఉజ్వలా యోజన, సుకన్య సమృద్ధి వంటి పథకాల ద్వారా మహిళల అభివృద్ధికి కృషి చేస్తోంది. తెలంగాణలో మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణం, స్వయం సహాయక సంఘాల బలోపేతం, విద్య--ఆరోగ్య పథకాలు అమలులో ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో కూడా మహిళలు వ్యవసాయం, చిన్న వ్యాపారాలు, సేవా రంగాల్లో కీలక పాత్ర పోషిస్తున్నారు.అయితే మహిళలపై అణిచివేత ఇంకా కొనసాగుతూనే ఉంది. బాల్య వివాహాలు, గృహహింస, అసమాన జీతాలు, లింగ వివక్ష వంటి సమస్యలు మహిళల అభివృద్ధికి అడ్డంకులుగా నిలుస్తున్నాయి. ఢిల్లీ నిర్భయ ఘటన దేశవ్యాప్తంగా మహిళల భద్రతపై చర్చకు దారి తీసింది. పాకిస్తాన్‌కు చెందిన మలాలా యూసఫ్ అమ్మాయిల విద్య కోసం చేసిన పోరాటం ప్రపంచానికి గొప్ప సందేశంగా నిలిచింది.మహిళల సాధికారత కోసం విద్యను ప్రోత్సహించడం, చట్టాలను కఠినంగా అమలు చేయడం, అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, ఆర్థిక స్వావలంబన కల్పించడం, కుటుంబం--సమాజం మద్దతు ఇవ్వడం అత్యవసరం.మహిళలు బలంగా ఉంటే దేశం కూడా బలంగా ఉంటుంది. మహిళల సాధికారతే సమాజ పురోగతికి పునాది. అందువల్ల మహిళలకు సమాన హక్కులు, గౌరవం, భద్రత కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత.

**వ్యాసకర్త**

**వేల్పుల కవిత మహేందర్**
**9912775834,**
**ఎంఎస్సి,ఎంఫ్,ఎంఎడ్,**

# ఏఐఎఫ్బి రాష్ట్ర కమిటీ తీర్మానం

**కరీంనగర్, మార్చి 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

అల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ (ఏఐఎఫ్బి) తెలంగాణ రాష్ట్ర కమిటీ సమావేశంలో రాజ్యాంగానికి విరుద్ధంగా ఏర్పడిన కన్వీనర్ పోస్టును రద్దు చేస్తూ ఏకగ్రీవంగా తీర్మానం చేశారు.తేదీ ఫిబ్రవరి 25న రాష్ట్ర చైర్మన్ ఎం. జావేద్ లతీఫ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. జాతీయ ప్రధాన కార్యదర్శి దేవరాజన్ ప్రకటించిన కన్వీనర్ పోస్టు రాష్ట్ర కమిటీ అనుమతి లేకుండా ఏర్పడిందని, అది రాజ్యాంగ విరుద్ధమని పేర్కొన్నారు.ఈ సందర్భంగా పార్టీ సీనియర్ నాయకుడు కొండ దయానంద్‌ను రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 2024లో జరిగిన రాష్ట్ర మహాసభల్లో ఎన్నికైన రాష్ట్ర కమిటీ యధావిధిగా కొనసాగుతుందని తెలిపారు.మార్చి 7న జరిగిన సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యులు ఎనిమిది మంది పాల్గొని, రెండు తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. రాష్ట్ర కమిటీలో నిజామాబాద్, మంచిర్యాల జిల్లాల ప్రధాన కార్యదర్శులు, అధ్యక్షులు, ప్రజా సంఘాల రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు, అధ్యక్షులు ఎక్స్-అఫీషియో సభ్యులుగా ఉన్నారు.

# కురిక్యాల వరద కాలువ పరిశీలన



**గంగాధర, మార్చి 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలంలోని కురిక్యాల వరద కాలువను మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు, మంత్రి గంగుల కమలాకర్, కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్సీ ఎల్. రమణతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ, కాళేశ్వరం ప్రాజెక్ట్ ద్వారా చొప్పదండి, జగిత్యాల, మెట్టుపల్లి, బాల్కొండ నియోజకవర్గాలకు నీళ్లు అందించామని, వరద కాలువలో ప్రవహిస్తున్న నీళ్లు కాళేశ్వరం నుంచే వస్తున్నాయని అన్నారు. రైతులు కాళేశ్వరం నీళ్లతో సంవత్సరానికి రెండు పంటలు పండిస్తున్నారని, వరద కాలువను జీవనదిగా మార్చింది కేసీఆర్ ప్రభుత్వం అని పేర్కొన్నారు.96% గౌరవెల్లి ప్రాజెక్ట్‌ను బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిందని, కానీ గత రెండున్నర సంవత్సరాలుగా ప్రాజెక్ట్ పనులకు ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని ఆయన విమర్శించారు. కాళేశ్వరం నీళ్లను అసత్య ప్రచారం చేస్తున్నారని, వాస్తవానికి రైతుల జీవనాధారం కాళేశ్వరం నీళ్లేనని హరీష్ రావు స్పష్టం చేశారు.

# చెత్త సమస్య పరిష్కారం

### 1వ వార్డు అనూషకు కృతజ్ఞతలు





నీలగిరి ఎక్స్‌ప్రెస్
www.neelagiriexpress.in
05 Mar 2026 - Page 5

చెత్త సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు

**హుస్నాబాద్, మార్చి 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

హుస్నాబాద్ పట్టణంలోని 1వ వార్డులో కొంతకాలంగా చెత్తను విచ్చలవిడిగా పారేయడం వల్ల స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రోడ్డ పక్కన చెత్త పేరుకుపోవడంతో దుర్వాసన వ్యాపించి, అక్కడి గుండా వెళ్లే ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యపై నివాసితులు పలుమార్లు ఆందోళన వ్యక్తం చేశారు.విషయాన్ని తెలుసుకున్న మున్సిపాలిటీ అధికారులు, వార్డు సభ్యురాలు అనూష వెంటనే స్పందించి చెత్తను తొలగించి పరిసరాలను శుభ్రం చేయించారు. మున్సిపల్ సిబ్బంది ప్రత్యేక శుభ్రతా కార్యక్రమం చేపట్టి చెత్తను పూర్తిగా తొలగించడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.ఈ సందర్భంగా అనూష మాట్లాడుతూ, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా మున్సిపాలిటీ ఏర్పాటు చేసిన బిందెల్లో వేయాలని సూచించారు. పరిశుభ్రమైన వాతావరణం ఉంటేనే ఆరోగ్యం కాపాడబడుతుందని ఆమె పేర్కొన్నారు. వార్డులో ఎలాంటి సమస్యలు ఉన్నా వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని ప్రజలను కోరారు.చెత్తను విచ్చలవిడిగా పారేయకుండా ఉండేందుకు జెసిబి సాయంతో చెత్త వేయడానికి ఉపయోగించే దారిని మూసివేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ



సిబ్బందితో పాటు సమీప హైస్కూల్ విద్యార్థులు కూడా పాల్గొని సహకరించారు. ఇకపై చెత్తను విచ్చలవిడిగా పారబోసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.ఈ సమస్యను త్వరితగతిన పరిష్కరించినందుకు వార్డు సభ్యురాలు అనూషకు, మున్సిపాలిటీ అధికారులకు నీలగిరి ఎక్స్‌ప్రెస్ తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము.

# విజయవంతంగా ముగిసిన కేసీఆర్ కప్ క్రికెట్ టోర్నమెంట్



**గంగాధర, మార్చి 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

: కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలంలో ఎర్ర అనిల్, అనూప్ ఆధ్వర్యంలో గత నెల రోజులుగా జరుగుతున్న ఉమ్మడి కరీంనగర్ జిల్లా టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్‌లో 90 జట్లు పోటీపడ్డాయి. ఈ రోజు జరిగిన తుది పోరులో విజేతలకు బహుమతులు ప్రదానం చేయడానికి ముఖ్య అతిథిగా సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ రాష్ట్ర మంత్రి తన్నీరు హరీష్ రావు హాజరయ్యారు.ఫైనల్ పోటీలో మాల్యాల్ జట్టు మొదటి బహుమతిని గెలుచుకోగా, గంగాధర క్రికెట్ అసోసియేషన్ రెండవ స్థానంలో నిలిచింది. శ్రీహరి సోల్జర్స్ మూడవ బహుమతిని, రామడుగు రాయల్స్ నాలుగవ బహుమతిని సాధించారు.ఈ కార్యక్రమంలో కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవి శంకర్, కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ కుమార్, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు జి.వి. రామకృష్ణ, వీర్ల వెంకటేశ్వర్లు, మాజీ గ్రంథాలయ చైర్మన్ ఏనుగు రవీందర్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ యువ నాయకులు దాగూర్, క్రీడాకారులు, పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, ప్రేక్షకులు పాల్గొన్నారు.క్రీడాస్ఫూర్తిని పెంపొందిస్తూ, యువతలో ప్రతిభను వెలికితీసే వేదికగా ఈ టోర్నమెంట్ నిలిచిందని నిర్వాహకులు తెలిపారు.

# నిర్మాణ వ్యర్థాలను తొలగించిన హుస్నాబాద్ మున్సిపాలిటీ

**హుస్నాబాద్, మార్చి 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక రెండవ రోజు కార్యక్రమంలో భాగంగా హుస్నాబాద్ పట్టణంలోని 1వ వార్డు పరిధిలోని సివిల్ హాస్పిటల్ బైపాస్ రోడ్ వద్ద పేరుకుపోయిన చెత్త, నిర్మాణ వ్యర్థాలను మున్సిపాలిటీ అధికారులు తొలగించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి, కమిషనర్ టీ. మల్లికార్జున్ ఆధ్వర్యం వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ హాజరై, ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో ప్రజలందరూ చురుకుగా పాల్గొని 99 రోజుల కార్యక్రమాలను విజయవంతం చేయాలని సూచించారు.చెత్తను జెసిబి సాయంతో తొలగించి డంపింగ్ యార్డ్‌కు తరలించారు. నిర్మాణ వ్యర్థాలను ప్రత్యేకంగా దామెరకుంట వద్ద ఏర్పాటు చేసిన సి డ డి కలెక్షన్ పాయింట్‌కు తరలించారు.చైర్‌పర్సన్ దండి లక్ష్మి మాట్లాడుతూ పట్టణ ప్రజలందరూ బహిరంగంగా చెత్త వేయకుండా తడి చెత్త, పొడి




చెత్త వేరు చేసి మున్సిపల్ వాహనాలకు అందించాలని సూచించారు. బహిరంగ మలమూత్ర విసర్జన చేయకుండా పబ్లిక్ టాయిలెట్స్ వినియోగించాలని, నిర్మాణ వ్యర్థాలను బహిరంగంగా పడేయకుండా మున్సిపాలిటీ ఏర్పాటు చేసిన కలెక్షన్ పాయింట్‌లో వేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ చిత్తారి పద్మ, కౌన్సిలర్లు చెన్నబోయిన అనూష, బూరుగు లత, కొండ రజిత, పిల్లి తిరుపతి, బోలిశెట్టి రాజు, భుక్యా సంపత్, కాశబోయిన సరిత, సావుల మంజుల, పూదరి వరప్రసాద్, బొల్లి శ్రీనివాస్, వైద్యం కిరణ్ ప్రసాద్, గాదెపాక రవీందర్, వాల సుప్రజ, బత్తుల స్వరూప, గోపగోని శోభన్ బాబు, ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు, మున్సిపల్ అధికారులు, వార్డు ఆఫీసర్లు, మెప్మా రిసోర్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో వికలాంగులకు స్కూటీల పంపిణీ






**పెద్దపల్లి, మార్చి 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని పెద్దపల్లి గాయత్రి డిగ్రీ మరియు పీజీ కళాశాలలో ముందస్తు వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి డి ఐ ఈ ఓ కల్పన, మహిళా పోలీస్ స్టేషన్ ఎస్ఐ రాజమని, టాస్క్ రీజనల్ ఆఫీసర్ కౌసల్య, డి డబ్ల్యు ఓ శ్యామల, గాయత్రి విద్యానికేతన్ కరస్పాండెంట్ రజనీ దేవి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి మహిళల సాధికారత, సమాజంలో వారి పాత్రపై ప్రేరణాత్మకంగా ప్రసంగించారు. అనంతరం విద్యార్థినులు సాంస్కృతిక కార్యక్రమాలతో తమ ప్రతిభను ప్రదర్శించారు. కళాశాల నిర్వహణ మహిళల సాధనలను ప్రశంసిస్తూ విద్యార్థులను అభినందించింది. కరస్పాండెంట్ అల్లెంకి శ్రీనివాస్, రజనీ దేవి కలిసి ముఖ్య అతిథులను, మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు. అదే రోజు పెద్దపల్లి మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన మహిళా దినోత్సవ వేడుకలకు శాసనసభ్యుడు చింతకుంట విజయరమణ రావు ముఖ్య అతిథిగా హాజరై మహిళా సోదరిమణులను సన్మానించారు. ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా మున్సిపల్ వారు 10 లక్షల రూపాయలతో కొనుగోలు చేసిన మూడు ట్రాక్టర్ ట్రాలీలను ప్రారంభించారు. అనంతరం రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 40 లక్షల రూపాయలతో 26 మంది వికలాంగులకు టీవీఎస్ జుపిటర్ స్కూటీలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ సృష్టికి మూలం అమ్మ అని, మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, తెలంగాణ ప్రభుత్వం మహిళలను కోటీశ్వరులను చేసే దిశగా కృషి చేస్తోందని అన్నారు. ప్రతి మహిళ ప్రతిభను గుర్తించి అవకాశాలు కల్పించడం జరుగుతోందని, రాజకీయాల్లోనూ ప్రభుత్వపరంగా ఐపీఎస్, ఐఏఎస్ అధికారులుగా రాణిస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ నుగిళ్ళ మల్లన్న, వైస్ ఛైర్ పర్సన్ ముస్కాన్ నాజ్, మున్సిపల్ కమిషనర్, కౌన్సిలర్లు, వ్యవసాయ మార్కెట్ ఛైర్మన్ కూర మల్ల రెడ్డి, జిల్లా సంక్షేమ శాఖ అధికారి వేణుగోపాల్, మెప్మా మహిళలు, సర్పంచులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## డ్రైవింగ్ లైసెన్స్, వాహన ధ్రువపత్రాలు తప్పనిసరి



**పెద్దపల్లి, మార్చి 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
:వాహనదారులు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, వాహనాలకు సంబంధిత ధ్రువపత్రాలు ఉండాలని పెద్దపల్లి రూరల్ ఎస్ఐ మల్లేష్ సూచించారు. శనివారం పెద్దకాల్వాల వద్ద వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇసుక తరలిస్తున్న వాహనాలను తనిఖీ చేయగా, డ్రైవింగ్ లైసెన్స్ లేకపోవడం, సరైన ధ్రువపత్రాలు లేని కారణంగా 12 ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించి జరిమానాలు విధించారు. ఎస్ఐ మల్లేష్ మాట్లాడుతూ, 18 ఏళ్లు నిండిన వారు మాత్రమే డ్రైవింగ్ లైసెన్స్ తీసుకుని వాహనాలు నడపాలని, లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం చట్ట విరుద్ధమని హెచ్చరించారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఈ తనిఖీల్లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రామాలకు ఆర్థిక సంఘం నిధుల విడుదల



**పెద్దపల్లి, మార్చి 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జిల్లాలోని గ్రామ పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధుల కింద 21 కోట్ల 4 లక్షల రూపాయలు విడుదల చేసినట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ప్రకటించారు. 2023--24, 2024--25 సంవత్సరాలకు సంబంధించిన ఈ నిధులు మూడు విడతల్లో విడుదలయ్యాయని ఆయన తెలిపారు. జనవరి 13, ఫిబ్రవరి 17, ఫిబ్రవరి 26 తేదీల్లో విడుదలైన నిధుల్లో అన్‌టైడ్ గ్రాంట్ 5 కోట్ల 73 లక్షలు, టైడ్ గ్రాంట్ 15 కోట్ల 31 లక్షలు ఉన్నాయని వివరించారు. అన్‌టైడ్ గ్రాంట్ నిధులను కరెంట్ బిల్లులు, జీతాలు, కార్యాలయ ఖర్చులకు వినియోగిస్తారని, టైడ్ గ్రాంట్ నిధులను అభివృద్ధి పనులకు ఉపయోగిస్తారని కలెక్టర్ పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కోసం ఈ నిధులను సమర్థవంతంగా వినియోగించాలని ఆయన సూచించారు.

## ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికలో స్పెషలిస్ట్ ఆరోగ్య సేవలు




**పెద్దపల్లి, మార్చి 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక 100 రోజుల కార్యక్రమంలో భాగంగా జిల్లా ప్రజలకు స్పెషలిస్ట్ ఆరోగ్య సేవలు అందుబాటులోకి వస్తున్నాయని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె. ప్రమోద్ కుమార్ తెలిపారు. మార్చి 6 నుండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో గైనకాలజీ, పీడియాట్రిక్, ఆర్థోపెడిక్, ఆప్తల్మాలజీ, జనరల్ మెడిసిన్, డెంటల్ వంటి విభాగాల వైద్యులు సేవలు అందిస్తారని ఆయన వివరించారు. సమీప ఆరోగ్య కేంద్రంలో ఈ సేవలు లభించినప్పుడు ప్రజలు తప్పక సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమం కింద మార్చి 6న రాఘవాపూర్‌లో, మార్చి 7న ఓదల, అడ్డగుంటపల్లిలో, మార్చి 9న అల్లూరు, పుట్నూరులో, మార్చి 10న జనగాం, 5-ఇన్‌ఇంక్లైన్‌లో, మార్చి 11న రాగినేడు, లక్ష్మీపూర్‌లో, మార్చి 12న పెద్దపల్లి, రామగుండంలో, మార్చి 13న రామగుండం, శ్రీరాంపూర్‌లో, మార్చి 14న అంతర్గంలో, మార్చి 16న బాసంతానగర్‌లో, మార్చి 17న బేగంపేట్‌లో, మార్చి 18న ఎలిగేడు లో, మార్చి 20న గద్దలపల్లిలో, మార్చి 23న గర్రెపల్లిలో, మార్చి 24న జూలపల్లిలో, మార్చి 25న కామాన్పూర్‌లో, మార్చి 26న కొలనూరులో, మార్చి 28న కూనారంలో, మార్చి 30న మేడారంలో, మార్చి 31న ముత్తారంలో స్పెషలిస్ట్ వైద్య శిబిరాలు నిర్వహించబడతాయి. జిల్లా ఆరోగ్యశాఖ అధికారులు ప్రజలు ఈ ప్రత్యేక వైద్య శిబిరాలను వినియోగించుకోవాలని, ఆరోగ్య సమస్యలను సమయానికి పరిష్కరించుకోవాలని సూచించారు.

## డాక్టర్ పొన్నం రవిచంద్రకు గద్దర్ ఫిల్మ్ అవార్డు



**హైదరాబాద్, మార్చి 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందజేస్తున్న తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్లో కరీంనగర్‌కు చెందిన డాక్టర్ పొన్నం రవిచంద్ర డాక్యుమెంటరీ విభాగంలో పురస్కారం అందుకున్నారు. తెలుగు సినిమాల వివిధ విభాగాలకు సంబంధించిన అవార్డులను ఈరోజు హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశంలో ప్రకటించారు. డాక్యుమెంటరీ విభాగంలో బాలీవుడ్‌లో 300కు పైగా సినిమాలలో నటించి, నిర్మించి, దర్శకత్వం వహించిన పైడి జయరాజ్ జీవన ఇతివృత్తంపై రూపొందించిన ది ఫస్ట్ యాక్షన్ హీరో డాక్యుమెంటరీ రెండవ అత్యుత్తమ డాక్యుమెంటరీగా ఎంపికైంది. డాక్టర్ పొన్నం రవిచంద్ర సీనియర్ జర్నలిస్టు, కవి, రచయిత, డాక్యుమెంటరీ చిత్రాల నిర్మాతగా, సినీ నిర్మాతగా తనదైన ముద్ర వేసిన సృజనశీలి. కరీంనగర్ ఫిలిం సొసైటీ అధ్యక్షుడిగా గత ఎనిమిదేళ్లుగా సినీ రంగ వికాసం కోసం, అత్యుత్తమ సినిమాల ప్రదర్శన ద్వారా యువతలో సినిమా కళ పట్ల ఆసక్తిని పెంచే దిశగా కృషి చేస్తున్నారు. పైడి జయరాజ్ జీవన ఇతివృత్తాన్ని ఆధారంగా చేసుకుని లక్షల రూపాయల వ్యయంతో ఈ డాక్యుమెంటరీని రూపొందించారు. ముంబైలో జయరాజ్ వారసులను సంప్రదించి అరుదైన ఫోటోలు, వీడియోలను సేకరించి ఈ అపూర్వమైన డాక్యుమెంటరీని రూపొందించడం విశేషం. ఈ కృషి వల్ల తెలుగు ప్రపంచానికి, తెలంగాణ సినీ ప్రేమికులకు పైడి జయరాజ్ గురించిన ఎన్నో విశేషాలు వెలుగులోకి వచ్చాయి. తెలంగాణ జాతి ఖ్యాతి సినీరంగంలో ఎదిగిన తీరుకు ఈ డాక్యుమెంటరీ అద్దం పట్టిందని, డాక్టర్ పొన్నం రవిచంద్రకు ఈ ప్రతిష్టాత్మక అవార్డు రావడం ఆనందదాయకమని కరీంనగర్ జిల్లాకు చెందిన కవులు, రచయితలు, సినిమా ప్రేమికులు శుభాకాంక్షలు తెలిపారు.

## సివిల్స్‌లో 55వ ర్యాంక్ సాధించిన గుడెల్లి సృజనకు శుభాకాంక్షలు






**మంథని, మార్చి 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ ఫలితాల్లో 55వ ర్యాంక్ సాధించిన మంథని ముద్దుబిడ్డ, సింగరేణి ఆణిముత్యం గుడెల్లి సృజనకు హార్దిక శుభాకాంక్షలు తెలిపారు మాజీ మంత్రి శ్రీధర్ బాబు. జాతీయ స్థాయిలో 5.77 లక్షల మంది అభ్యర్థులు పోటీ పడిన సివిల్స్ పరీక్షల్లో సృజన సాధించిన అద్భుత విజయాన్ని ఆయన ప్రశంసించారు. సింగరేణి కార్మికుడైన ఆమె తండ్రి రాజేశం, తల్లి రాణి ప్రోత్సాహం వల్లే ఈ విజయాన్ని సాధించగలిగిందని పేర్కొన్నారు. మంథని జెఎన్‌టియులో బి.టెక్ చదివిన విద్యార్థిని సివిల్స్‌లో ర్యాంక్ సాధించడం ఆనందదాయకమని, మారుమూల ప్రాంతానికి చెందిన బిడ్డ దేశం గర్వించే స్థాయికి ఎదగడం మాటల్లో వర్ణించలేనిదని అన్నారు. సివిల్స్‌లో విజయం సాధించిన తెలంగాణ అభ్యర్థులందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారి విజయాలు యువతకు ప్రేరణగా నిలుస్తాయని శ్రీధర్ బాబు పేర్కొన్నారు.


## ఎన్‌సిసి కేడిట్ అభిరామ్‌కు ఘన సన్మానం



**కరీంనగర్, మార్చి 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
77వ గణతంత్ర దినోత్సవ సందర్భంగా ఢిల్లీలో జరిగిన గణతంత్ర వేడుకల్లో పాల్గొన్న ఎన్‌సిసి (ఆర్‌డిసి) కేడిట్ అక్కినపల్లి అభిరామ్‌ను కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ అలాం శనివారం తన క్యాంప్ ఆఫీస్‌లో సన్మానించారు. జ్ఞాపికను అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అభిరామ్ దేశభక్తి, క్రమశిక్షణ, అంకితభావం, నిరంతర శ్రమకు నిదర్శనమని, చిన్న వయసులోనే రాష్ట్రపతి, ప్రధానమంత్రి సమక్షంలో రిపబ్లిక్ వేడుకల్లో పాల్గొనడం హర్షనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వాక్యత మాడిశెట్టి గోపాల్, భరోసా స్వచ్ఛంద సేవ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు అక్కినపల్లి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక మాఫియా అక్రమ రవాణాపై ప్రజల్లో ఆందోళన





**హుస్నాబాద్, మార్చి 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
చిగురుమామిడి మండల పరిసర ప్రాంతాల్లో ఇసుక మాఫియా అక్రమ రవాణా రోజురోజుకు పెరుగుతూ ప్రజల్లో ఆందోళనకు కారణమవుతోంది. అర్ధరాత్రి, తెల్లవారుజామున వరుసగా ట్రాక్టర్లు ఇసుకను తరలించడం సాధారణంగా మారింది. ఒక ట్రాక్టర్ ముందుగా నడుస్తుండగా దాని వెనుక వరుసగా మరికొన్ని ట్రాక్టర్లు వెళ్లడం స్థానికులు గమనిస్తున్నారు. ప్రజల సమాచారం ప్రకారం ఒకే రసీదుతో పది వరకు ట్రాక్టర్లు ఇసుక తరలిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ వాహనాలకు నిజంగా అనుమతులు ఉన్నాయా లేదా అన్నది సందేహంగా మారింది. అధికారులు కనిపించని సమయంలో వేగంగా వెళ్లే ఈ ట్రాక్టర్ల వల్ల రహదారులపై ప్రయాణించే ప్రజలకు ప్రమాదం ఏర్పడుతుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇసుక అక్రమ రవాణాపై సంబంధిత అధికారులు, పోలీస్ శాఖ వెంటనే దృష్టి సారించి పర్మిషన్ లేని ట్రాక్టర్లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# ప్రగతి ప్రణాళికలో తొలి అడుగులు



**ఉప్పునుంతల, మార్చి 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఉప్పునుంతల మండలం పరిధిలోని దేవదారి కుంట తండా గ్రామంలో అభివృద్ధి చర్యలు ప్రారంభమయ్యాయి.గ్రామ సర్పంచ్ మునావత్ మంగమ్మ, రతన్ సింగ్ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ, అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాల వద్ద పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామ కార్యదర్శి చందర్ సమక్షంలో పారిశుద్ధ్య కార్మికులు సహకారంతో శుభ్రత పనులు చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ మంగమ్మ పాఠశాల, అంగన్వాడీ కేంద్రాలను సందర్శించి సమస్యలు తెలుసుకున్నారు. పిల్లల సంఖ్య పెరగాలని, వారికి నాణ్యమైన భోజనం, విద్య అందించాలని, అందుకు గ్రామ పంచాయతీ పూర్తి స్థాయిలో సహకరిస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయుడు రతన్ ప్రసాద్, అంగన్వాడీ టీచర్ సోనా, వైద్య సిబ్బంది దేవి, శ్రీనివాస్, వీణా, ఆశా వర్కర్లు ఫరేంగన్, అనూష, గ్రామ ప్రజలు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## బెస్ట్ రన్నర్స్ కమ్యూనిటీ ఎడ్యుకేషన్ సంస్థ సమక్షంలో విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ



**అచ్చంపేట, మార్చి 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలం నడింపల్లి గ్రామంలో బెస్ట్ రన్నర్స్ కమ్యూనిటీ ఎడ్యుకేషన్ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు సైకిళ్లను అందజేశారు.నడింపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల స్వయంపాలన దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి శాసనసభ్యుడు వంశీకృష్ణ హాజరై విద్యార్థులను అభినందించారు. అనంతరం సైకిల్ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు విద్యలో రాణించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు విద్య సులభంగా అందేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని తమ లక్ష్యాలను సాధించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, స్థానిక నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## సిర్సనగండ్లలో సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై సమీక్ష



**చారగొండ, మార్చి 7(నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
చారకొండ మండల పరిధిలోని సిర్సనగండ్లలో ఆయోధ్యనగర్ గుట్టపై పుణ్యక్షేత్రంగా వెలసిన సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాలు, జాతర ఏర్పాట్లపై సమీక్ష సమావేశం జరిగింది.ఈ సమావేశానికి ఎమ్మెల్యే వంశీకృష్ణ అధ్యక్షత వహించారు. జాతర సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి స్థాయిలో చేయాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. అలాగే భక్తులకు సౌకర్యవంతంగా దర్శనం కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు.ఈ సమావేశంలో దేవాదాయ శాఖ అధికారులు, పోలీస్ అధికారులు, గ్రామ ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మహిళా దినోత్సవం సందర్భంగా ఘన సన్మానం

**అచ్చంపేట, మార్చి 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మున్సిపాలిటీ పరిధిలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని భారతీయ జనతా పార్టీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో మహిళలకు ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు బాల్మూరి జానకి ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా మున్సిపాలిటీ పరిధిలో పనిచేస్తున్న మహిళా కార్మికులను సన్మానించి వారి సేవలను కొనియాడారు. అనంతరం అచ్చంపేట గర్ల్స్ హై స్కూల్‌లో పనిచేస్తున్న ఉపాధ్యాయురాళ్లను శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా బాల్మూరి జానకి మాట్లాడుతూ మహిళలు కుటుంబ నిర్మాణంలోనే కాకుండా సమాజ అభివృద్ధిలో కూడా కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. మహిళల కష్టం,




సేవలను గుర్తించి గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ముఖ్యంగా మున్సిపల్ మహిళా కార్మికులు పట్టణ పరిశుభ్రత కోసం ఎంతో కష్టపడుతున్నారని, ఉపాధ్యాయురాళ్లు భవిష్యత్ తరాలను తీర్చిదిద్దే గొప్ప బాధ్యతను నిర్వహిస్తున్నారని ఆమె అభినందించారు.భారతీయ జనతా పార్టీ ఎప్పటికీ మహిళల గౌరవం, భద్రత, సాధికారత కోసం కట్టుబడి పనిచేస్తుందని, మహిళలు అన్ని రంగాలలో ముందుకు రావాలని పార్టీ ప్రోత్సహిస్తుందని ఆమె పేర్కొన్నారు. మహిళలను గౌరవించే సమాజమే అభివృద్ధి చెందుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో డా. సౌమ్య, మహేశ్వరి, బీజేపీ నాయకులు బాలాజీ, పట్టణ అధ్యక్షుడు గండు శ్రీనివాస్, రంగినేని రవీందర్, శివ చంద్ర, చందు లాల్ చౌహాన్, మహిళా మోర్చా నాయకులు, బీజేపీ కార్యకర్తలు, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

## సిరిసిల్లలో కోర్టు భవన నిర్మాణానికి శంకుస్థాపన


**రాజన్న సిరిసిల్ల, మార్చి 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో కొత్త కోర్టు భవనాల సముదాయం నిర్మాణానికి శనివారం శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా జరిగింది. పాత కోర్టు ప్రాంగణంలోనే సుమారు 5 ఎకరాల విస్తీర్ణంలో రూ.81 కోట్ల 60 లక్షల వ్యయంతో నిర్మించబోయే ఈ భవనం రాబోయే 50 సంవత్సరాల అవసరాలను తీర్చేలా అత్యాధునిక వసతులతో రూపుదిద్దుకోనుంది.12 రకాల న్యాయస్థానాలు కొలువుదీరేలా రూపొందిస్తున్న ఈ భవనం ఒక్కో అంతస్తు 21 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించబడుతుంది. విశాలమైన కోర్టు హాళ్లు, ప్రతి అంతస్తులో ప్రత్యేక వాష్‌రూములు, కక్షిదారులకు వెయిటింగ్ హాళ్లు, కనీసం 300 కార్లకు పార్కింగ్ సౌకర్యం కల్పించేలా నిర్మాణం చేపడుతున్నారు. సెల్లార్‌తో పాటు టెన్ ప్లస్ టు నిర్మాణ శైలిలో రాబోయే రెండేళ్లలో పూర్తిస్థాయిలో



భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని అధికారులు సంకల్పించారు.శంకుస్థాపన కార్యక్రమానికి రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ వర్చువల్ విధానంలో పాల్గొన్నారు. హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఎన్ తుకారాంజీ, జస్టిస్ కె లక్ష్మణ్, జస్టిస్ విజయసేన్ రెడ్డి, జస్టిస్ నందికొండ నర్సింగరావు, జస్టిస్ ఇవి వేణుగోపాల్, జస్టిస్ పుల్లా కార్తీక్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి. నీరజ మాట్లాడుతూ ఈ భవనం జిల్లా ప్రజలకు ప్రతిష్టాత్మకంగా నిలుస్తుందని, న్యాయవాదులు, ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.ఈ సమావేశంలో న్యాయమూర్తులు బి. పుష్పలత, రాధిక జైస్వాల్, పి. లక్ష్మణ చారి, ఏ. ప్రవీణ్ కుమార్, న్యాయవాదుల సంఘం సిరిసిల్ల--వేములవాడ అధ్యక్షుడు జూపల్లి శ్రీనివాసరావు, సదానందం, సీనియర్--జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.కోర్టు భవనాల శంకుస్థాపన కార్యక్రమానికి హైకోర్టు న్యాయమూర్తులు సిరిసిల్ల జిల్లాకు చేరుకోగా, వారికి జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి. నీరజ, కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి. గితే, బార్ అసోసియేషన్ సభ్యులు, అధికారులు పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు.

# కీలకమైన అమెరికా రేడార్‌ను పేల్చేసిన ఇరాన్

**దుబాయ్ -మార్చి 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
అమెరికా-ఇజ్రాయెల్ దళాలకు ధీటుగా ఇరాన్ బదులిస్తున్నది. గల్ఫ్ దేశాల్లో ఉన్న అమెరికా స్థావరాలపై విరుచుకుపడుతున్నది. అయితే వార్ మొదలైన తొలి రోజుల్లోనే అమెరికాకు చెందిన కీలక రేడార్‌ను ఇరాన్ పేల్చివేసింది. జోర్డాన్‌లోని మువాఫక్ సల్టీ ఎయిర్‌బేస్ వద్ద ఉన్న ఏఎన్-టీపీవై-2 రేడార్‌ను ఇరాన్ ధ్వంసం చేసినట్లు శాటిలైట్ ఇమేజ్‌ల ద్వారా నిర్ధారించారు. ఏఎన్-టీపీవై-2 రేడార్‌ను థాడ్ క్షిపణి బ్యాటరీగా వాడుతారు. శత్రు దేశ క్షిపణులు, డ్రోన్ల రాకలను ఈ రేడార్ పసికట్టి .. మిస్సైల్ వ్యవస్థకు సమాచారం ఇస్తుంది. అయితే జోర్డాన్, సౌదీ అరేబియా, యూఏఈ దేశాల్లో ఉన్న అమెరికా మిస్సైల్ ఇంటర్‌సెప్టార్ రేడార్ కేంద్రాలను ఇరాన్ ధ్వంసం చేసినట్లు శాటిలైట్ ఇమేజ్‌ల ద్వారా



అంచనా వేస్తున్నారు. సౌదీ అరేబియాలోని ప్రిన్స్ సుల్తాన్ ఎయిర్‌బేస్ వద్ద ఉన్న రేడార్ వ్యవస్తను ధ్వంసం చేసినట్లు తెలుస్తోంది. దీంతో పాటు యూఏఈలోని సదర్, రువాయిస్‌లో ఉన్న అమెరికా రేడార్లు కూడా ధ్వంసమైనట్లు శాటిలైట్ పిక్స్ ద్వారా భావిస్తున్నారు.మిస్సైల్ దాడులను పసికట్టడంలో రేడార్లు కీలకంగా వ్యవహరిస్తాయి. టార్గెట్ దిశగా వస్తున్న బాలిస్టిక్ క్షిపణులను రేడార్లు పసికట్టడం వల్లే యాంటీ మిస్సైల్ వ్యవస్థ యాక్టివేట్ అవుతుంది. అయితే ప్రస్తుతం అమెరికా వద్ద ఉన్న థాడ్ మిస్సైల్ వ్యవస్థకు చెందిన 8 బ్యాటరీలు ఆపరేషన్‌లో ఉన్నాయి. రెండు యూఏఈ దగ్గర, ఒకటి సౌదీ అరేబియా వద్ద ఉన్నాయి. ఇక ఇరాన్‌కు సుమారు 500 కిలోమీటర్ల దూరంలో ఉన్న జోర్డాన్‌లోని సాల్టి ఎయిర్‌బేస్‌లో కూడా ఓ థాడ్ బ్యాటరీ ఉన్నది. థాడ్ రేడార్ సిస్టమ్‌ను ఏఎన్-టీపీవై-2గా పిలుస్తారు. ఇది ట్రాన్స్‌పోర్టబుల్ రేడార్. రేథియాన్ కంపెనీ దీన్ని ఉత్పత్తి చేస్తున్నది. సుమారు 50 కోట్ల బిలియన్ల ఖరీదైన రేడార్ వ్యవస్థ అమెరికా వద్ద ఉన్నట్లు తెలుస్తోంది.

## దేశంలో 308కి చేరిన అపరకుబేరులు

భారతీయ బిలియనీర్లలో 7 శాతం మంది మహిళలు ఉన్నారు. ఇక హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ ఛైర్‌పర్సన్ రోష్ని నాడార్ మల్హోత్రా రూ.3.2 లక్షల కోట్లతో మూడవ స్థానంలో నిలవడమే కాకుండా.. టాప్ 10 జాబితాలో ఉన్న ఏకైక మహిళగా గుర్తింపు పొందారు. రిలయన్స్ అధినేత ముకేశ్ అంబానీ రూ.9.8 లక్షల కోట్ల సంపదతో ఆసియాలోనే అత్యంత సంపన్న వ్యక్తిగా ఉన్నారు. గౌతమ్ అదానీ రూ.7.5 లక్షల కోట్లతో రెండో స్థానంలో కొనసాగుతున్నారు. హెల్త్‌కేర్ రంగంలో అత్యధికంగా 53 మంది కొత్త బిలియనీర్లు నమోదయ్యారు. ఇంధన రంగంలో కేవలం 8 మంది బిలియనీర్లు ఉన్నప్పటికీ, అత్యధికంగా రూ.18.3 ట్రిలియన్ల సంపదను ఈ రంగం కలిగి ఉంది. 95 మంది బిలియనీర్లతో ముంబయి భారత్‌లో అగ్రస్థానంలో కొనసాగుతోంది.

వెక్కిరిస్తున్న పేదరికం

హెల్త్‌కేర్, ఎనర్జీ వంటి కీలక రంగాలు ఈ అపర కుబేరులకు కాసుల వర్షం కురిపిస్తున్నాయి. మరోవైపు క్షేత్రస్థాయిలో సామాన్యుడి పరిస్థితి మాత్రం దయనీయంగా మారుతోంది. బిలియనీర్ల సంపద 10 శాతం పెరిగినప్పటికీ.. పెరుగుతున్న ద్రవ్యోల్బణం, నిరుద్యోగం సామాన్యుడి కొనుగోలు శక్తిని హరిస్తున్నాయి. ముఖ్యంగా హెల్త్‌కేర్, ఆటో విడిభాగాలు, ఎనర్జీ రంగాల్లో కొత్త కుబేరులు పుట్టుకొస్తున్న తరుణంలోనే అదే ఆరోగ్య సేవలు సామాన్యుడికి అత్యంత ఖరీదైనవిగా మారుతుండటం గమనార్హం. కేవలం ముంబయి వంటి మెట్రో నగరాలు సంపదకు కేంద్రాలుగా మారుతుండగా, గ్రామీణ భారతం ఇప్పటికీ కనీస మౌలిక సదుపాయాల కోసం పోరాటం చేస్తూనే ఉంది. బిలియనీర్ల సంఖ్య పెరగడం ముమ్మందు రాబోయే ఆర్థిక అసమానతలకు హెచ్చరికలా అనేది ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. కేవలం 308 మంది కుబేరులు ఉండటం కన్నా, కోట్లాది మంది పేదరికం నుంచి బయటపడటమే నిజమైన అభివృద్ధి అని ఆర్థిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు